
ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY
కర్నూలు
జిల్లా వార్తలు
3
శనివారం 26 ఏప్రిల్ 2025

మాదక ద్రవ్యాల నియంత్రణకు చర్యలు



మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్ బాషా, ఎస్పీ విక్రాంత్ పాటిల్

కలెక్టర్ పి. రంజిత్ బాషా

కర్నూలు కలెక్టరేట్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మాదక ద్రవ్యాల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పి. రంజిత్ బాషా సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నార్కొటిక్స్ కోఆర్డినేటషన్ (ఎన్‌సీవోఆర్‌డీ) సమావేశాన్ని ఎస్పీ విక్రాంత్ పాటిల్‌తో కలిసి నిర్వహించారు. గంజాయి సాగు నివారణ చర్యలు, మాదక ద్రవ్యాల వాడకం, నియంత్రణ చర్యలపై సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే నష్టాల గురించి పాఠశాలలు, కళాశాలలు, యూనివర్సిటీల్లో విస్తృత ప్రచారం చేయాలని అధికారులను ఆదేశించారు. వచ్చే విద్యాసంవత్సరం నుంచి మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాల గురించి పాఠశాలలో వ్యాసరచన, వక్తృత్వ పోటీలు, ర్యాలీలు, ప్రతిజ్ఞల ద్వారా విద్యార్థులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని డీఈవోను ఆదేశించారు.

ఎస్పీ విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూ మత్తు పదార్థాల వినియోగం, గంజాయి సాగు అమ్మకం చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎద్దులకు తినిపిస్తే బలమని మిరప పంట మధ్యలో గంజాయి సాగు చేస్తున్నారని తెలిసిందని, వ్యవసాయ శాఖ అధికారులు గంజాయి సాగు చట్టపరంగా నేరమనే విషయం పూర్తిగా అర్థమయ్యేలా రైతులకు అవగాహన కల్పించాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారికి సూచించారు. కర్నూలు, ఆదోని ఎమ్మిగనూరు పట్టణ ప్రాంతాల శివారులో ముళ్లపొదలు, పాడుపడిన భవనాలు తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని, వీధి లైట్లు వేయించాలని మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. ఈ సమావేశంలో జడ్పీ సీఈవో నాసరరెడ్డి, నగరపాలక సంస్థ కమిషనర్ రవీంద్రబాబు, డీటీసీ శాంతకుమారి, ఎక్సైజ్ సూపరింటెండెంట్ సుధీర్ కుమార్, డీఎంహెచ్‌వో శాంతికళ, డీఈవో శామ్యూల్ పాల్, ఆర్టీసీ ఆర్ఎం శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

19 నుంచి ఓపెన్ స్కూల్
సప్లిమెంటరీ పరీక్షలు

అమరావతి, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యంలో పదోతరగతి, ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థులకు మే 19 నుంచి సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నట్లు సొసైటీ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపింది. 24 వరకు పరీక్షలు జరుగుతాయని పేర్కొంది. పరీక్షా కేంద్రాలు కేటాయించాలని ప్రభుత్వ పరీక్షల విభాగానికి లేఖ రాసినట్టు తెలిపింది. మే 26 నుంచి 30 వరకు ఇంటర్ ప్రాక్టికల్స్ నిర్వహించనున్నట్టు పేర్కొంది.



ఇంజనీర్లు కావలెను..!

- ఇంజనీర్ లేకుండానే ఆదోని ఎంఐ సబ్ డివిజన్
- డీఈఈ, ఏఈఈల పోస్టులన్నీ ఖాళీ
- 33 చెరువులు.. 5 వేల ఎకరాలకు పైగా ఆయకట్టు
- చెరువుల నిర్వహణను గాలికొదిలేశారు

ఆదోని సబ్ డివిజన్ మైనర్ ఇరిగేషన్ (ఎంఐ) కార్యాలయం ఇది. ఎప్పుడో బ్రిటీష్ కాలం నాటి శిథిలమైన భవనంలో కొనసాగుతోంది

గ్రామసీమల జలరాశులు చెరువులు. వర్షపు నీటిని ఒడిసిపట్టి తాగు, సాగునీటి అవసరాలు తీరుస్తున్న చెరువుల నిర్వహణను గాలికి వదిలేశారు. చిన్ననీటి పారుదల శాఖ ఆదోని సబ్ డివిజన్ దుస్థితి ఇందుకు అద్దం పడుతోంది. ఒక్క ఇంజనీరు కూడా లేకపోవడంతో ఫైళ్లు ముందుకు కదలడం లేదు. డీఈఈ, ఏఈఈ పోస్టులు అన్నీ ఖాళీగానే ఉన్నాయి. నెలలు గడిచినా కార్యాలయ తలుపులు తీసేవారు లేరు. ఎప్పుడో వందేళ్ల క్రితం బ్రిటీష్ కాలంలో నిర్మించిన శిథిలమైన పెంకుల భవనంలోనే ఎంఐ సబ్ డివిజన్ కార్యాలయం కొనసాగుతోంది. ఇంజనీర్లు లేక 33 చెరువులు, 5 వేల ఎకరాలకు పైగా ఆయకట్టు పరిస్థితి దయనీయంగా మారింది. ఎమ్మెల్యేలు కూడా పట్టించుకోకపోవడం పలు విమర్శలకు తావిస్తోంది. దిక్కుమొక్కులేని ఆదోని మైనర్ ఇరిగేషన్ సబ్ డివిజన్ దుస్థితిపై ఆంధ్రజ్యోతి కథనం.

కర్నూలు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో చిన్నతరహా నీటిపారుదల శాఖ పరిధిలో కర్నూలు, డోన్, పత్తికొండ, ఆదోని సబ్ డివిజన్లు ఉన్నాయి. మైనర్ ఇరిగేషన్, పంచాయతీరాజ్ చెరువులు 310 ఉన్నాయి. వాటి పరిధిలో 33,113 ఎకరాల ఆయకట్టు ఉంది. ఆదోని సబ్ డివిజన్ పరిధిలో ఆదోని, ఆలూరు, ఎమ్మిగనూరు, నియోజకవర్గాల్లో మైనర్ ఇరిగేషన్ చెరువులు 13, పంచాయతీ రాజ్ చెరువులు 30 వరకు ఉన్నాయి. వీటి కింద దాదాపుగా 5 వేల ఎకరాలకు పైగా ఆయకట్టు ఉంది. ఆలూరు నియోజకవర్గంలో 7, ఆదోనిలో 4 పెద్ద చెరువులు ఉన్నాయి. నిత్యం కరువుతో తల్లడిల్లే పశ్చిమ ప్రాంతంలో గ్రామీణులకు సాగునీరు, పశువులకు తాగునీరు అందించడంతో కీలకమైనవి చెరువులే. పల్లెసీమల జలరాశులు ప్రస్తుతం దిక్కుమొక్కులేని పరిస్థితి ఏర్పడింది. మరమ్మతులు, పూడిక తీత పనులు చేపట్టకపోవడంతో చెరువులు పిచ్చిమొక్కలు, ముళ్ల కంపలతో నిండిపోతున్నాయి. తూములు, పంట కాలువలు, అలుగులు పాడైపోతున్నాయి. చెరువు నిర్వహణలో రైతులతో పాటు ఇంజనీర్ల పాత్ర ఎంతో కీలకం. వర్షాకాలంలో చెరువులకు గండ్లు పడితే తక్షణమే స్పందించే ఇంజనీరు ఒక్కరు కూడా లేకపోవడం కొసమెరుపు.

పోస్టులన్నీ ఖాళీ...

ఆదోని ఎంఐ సబ్ డివిజన్ పరిధిలో ఆదోని, ఆలూరు, ఎమ్మిగ నూరు నియోజకవర్గాల్లో చెరువుల నిర్వహణ కోసం డీఈఈ, నలుగురు ఏఈఈలు పని చేయాల్సి ఉంది. ప్రస్తుతం ఈ పోస్టులన్నీ ఖాళీగా ఉన్నాయి. దీంతో చెరువుల నిర్వహణ దిక్కులేకుండా పోయింది. నాబార్డు నిధులతో చెక్‌డ్యాంలు నిర్మాణానికి అన్ని మండలాల్లో ప్రతిపాదనలు పంపితే.. ఆదోని, ఎమ్మిగనూరు, నందవరం మండలాల నుంచి ఒక్క ప్రతిపాదన కూడా పంపలేదు. ఇటీవల జిల్లా ఇన్‌చార్జి, జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఆధ్వర్యంలో జరిగిన డీడీఆర్‌సీ సమావేశంలో ఆదోని అంటే ఎందుకు వివక్షత అంటూ ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి జిల్లా అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంజనీర్లే లేకపోతే ప్రతిపాదనలు తయారు చేసేది ఎలా..? ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చి ఏఈఈలను ఎందుకు నియమించుకోలేకపోతున్నారు..? అంటూ ఇరిగేషన్ శాఖ అధికారుల వాదన. జూన్ నుంచి ఖరీఫ్ సీజన్ ప్రారంభం అవుతుంది. వర్షాలు వస్తే చెరువులు నిండుతాయి. చెరువులకు చేరే వరద నిర్వహణ సక్రంగా లేకపోతే గట్లు తెగిపోయే ప్రమాదం ఉంది. ఆదోని, ఎమ్మిగనూరు ఎమ్మెల్యేలు డాక్టర్ పార్థసారథి, ఆలూరు టీడీపీ ఇన్‌చార్జి వీరభద్రగౌడ్‌లు ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి మైనర్ ఇరిగేషన్ ఆదోని సబ్ డివిజన్‌కు డీఈఈ, ఏఈఈలను నియమించాలని రైతులు కోరుతున్నారు. కాగా పదోన్నతుల్లో భాగంగా చిత్తూరు జిల్లా సత్యవేడులో ఎన్టీఆర్ టీజీపీ సబ్ డివిజన్-1లో పని చేస్తున్న ఏఈఈ ఎన్.రాజగోపాల్‌కు డీఈఈగా పదోన్నతి ఇచ్చి ఆదోని ఎంఐ సబ్ డివిజన్‌కు బదిలీ చేశారు. అయితే వచ్చే నెల మే 31న ఆయన పదవీవిరమణ అవుతున్న నేపథ్యంలో నియమించినా ప్రయోజనం లేకుండా పోతోంది.



శిథిలావస్థలో ఎంఐ ఆదోని సబ్ డివిజన్ కార్యాలయం దుస్థితి

శిథిలమైన భవనం

ఆదోని పట్టణం రైల్వే స్టేషన్ రోడ్డులో మైనర్ ఇరిగేషన్ సబ్ డివిజన్ కార్యాలయం ఉంది. వందేళ్ల క్రితం బ్రిటీష్ పాలన కాలంలో నిర్మించిన పెంకుల భవనంలో కొనసాగుతోంది. ఆలనాపాలన లేక శిథిలావస్థకు చేరుకుంది. పెంకులు ఊడిపోయి పైకప్పు చిల్లులు పడ్డాయి. వర్షం వస్తే తడిసిముద్దవుతుంది. 15 ఏళ్ల క్రితం కొత్త భవనం నిర్మించినా.. నాణ్యతాప్రమాణాలు పాటించకపోవడంతో ఆ భవనం కూడా శిథిలావస్థకు చేరుకుంది. ఈ ప్రాంతం వ్యాపార కేంద్రంగా దినాదినాభివృద్ధి చెందుతుండడంతో ఐఎం సబ్ డివిజన్ కార్యాలయం భవనం స్థలం రూ.కోట్లు పలుకుతోంది. అన్యాక్రాంతం కాకుండా నూతన భవనం నిర్మించాలి. ఖాళీగా ఉన్న డీఈఈ, ఏఈఈల పోస్టులు భర్తీ చేసి చెరువుల సరంక్షణకు పాటుపడాలని రైతులు కోరుతున్నారు.


ఖాళీల వివరాలు ప్రభుత్వానికి పంపుతాం



ఆదోని మైనర్ ఇరిగేషన్ సబ్ డివిజన్ పరిధిలో డీఈఈ పోస్టు సహా ఏఈఈ పోస్టులు 4 ఖాళీగా ఉన్న మాట వాస్తవమే. రెండు రోజుల క్రితం పదోన్నతిలో భాగంగా చిత్తూరు జిల్లా నుంచి డీఈఈని నియమించినా ఆయన కూడా మే 31న పదవి విరమణ చేస్తున్నారు. ఆదోని సబ్ డివిజన్‌తో పాటు జిల్లాలో ఇంజనీర్లు పోస్టుల ఖాళీల వివరాలు ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తున్నాం.

- ద్వారకనాథ్‌రెడ్డి, ఎస్ఈ, ఇరిగేషన్ సర్కిల్, కర్నూలు

పశ్చిమ ప్రాంతంపై నిర్లక్ష్యం



జిల్లాలో పశ్చిమ ప్రాంత కరువు పల్లెసీమల్లో తాగు, సాగునీటి వనరులు అభివృద్ధి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఎన్నో ఏళ్లుగా చెరువులపై ఆధార పడుతున్నాం. వాటి నిర్వహణ చూసే ఇంజనీర్ల పోస్టులు ఏడేళ్లుగా ఖాళీగా ఉన్నాయి. మా కూటమి ప్రభుత్వం కూడా డీఈఈ, ఏఈఈలను నియమించలేదు. పశ్చిమ ప్రాంతంపై నిర్లక్ష్యం తగదు. ఇప్పటికే జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు దృష్టికి తీసుకెళ్లాను. మరోసారి జిల్లా ఇన్‌చార్జి మంత్రిని కలసి ఆదోని ఎంఐ సబ్ డివిజన్‌లో ఖాళీగా ఉన్న ఇంజనీరింగ్ పోస్టులను వంద శాతం భర్తీ చేయాలని విన్నవిస్తాను. రాబోయే వర్షాకాలంలో చెరువులకు గండ్లు పడితే ఎవరిది బాధ్యత?

- డాక్టర్ పీవీ పార్థసారథి, ఎమ్మెల్యే, ఆదోని

ప్రగతిలో రహదారి



- ఓర్వకల్లు పారిశ్రామిక ప్రగతిలో మరో అడుగు
- నాలుగు వరుసల రోడ్లుకు రూ.207 కోట్లు
- నేషనల్ హైవేగా ఉప్పలపాడు, రామళ్లకోట, గుట్టపాడు రోడ్లు
- ఎన్‌హెచ్ఏఐ అధికారులతో మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి
- ఇప్పటికే 2,612 ఎకరాల్లో రూ.2,786 కోట్లతో మౌలిక వసతులు

కర్నూలు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఓర్వకల్లు పారిశ్రామిక ప్రగతి పరుగులు పెడుతోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చి నిధులు రాబడుతోంది. హైదరాబాద్-బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్ (హెచ్‌బీఐసీ)లో భాగంగా కేంద్ర ప్రభుత్వం ఓర్వకల్లు ఇండస్ట్రియల్ నోడ్ అభివృద్ధికి శ్రీకారం చుట్టింది. ఇప్పటికే ఫేజ్-1 కింద 2,612 ఎకరాలలో రూ.2,786 కోట్లతో ప్రణాళిక సిద్ధం చేసింది. పలు పరిశ్రమలు ఏర్పాటుకు సన్నాహాలు చేపట్టింది. రవాణా సౌకర్యాలపై శుక్రవారం నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్ఏఐ) అధికారులతో రోడ్లు భవనాలు, పెట్టుబడులు, మౌలిక వసతుల శాఖ బీసీ జనార్ధన్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఓర్వకల్లు ఇండస్ట్రియల్ నోడ్ పరిధిలో 32 కి.మీలు జిల్లా రహదారులను నాలుగు వరుసల రోడ్లు (4 లైన్ రోడ్స్)గా అభివృద్ధి చేయడం, రైల్వే లైన్ల ఏర్పాటుపై చర్చించారు. ఇప్పటికే వీటిపై ఎన్‌హెచ్ఏఐకు లేఖ కూడా రాశారు. ఉప్పలపాడు-ఉశేనాపురం, ఉప్పలపాడు-రామళ్లకోట, గుట్టపాడు-బ్రహ్మణపల్లి రోడ్లు నాలుగు వరుసల రహదారులుగా ఆధునికీకరణ చేయనున్నారు.

నాలుగు లైన్ల రహదారులు

రాష్ట్రంలో జాతీయ రహదారులు, రైల్వే ప్రాజెక్టులపై రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి అధ్వర్యంలో 2వ టాస్క్ ఫోర్స్ కమిటీ సమావేశం జరిగింది. రాష్ట్రంలో చేపట్టిన జాతీయ రహదారుల ప్రాజెక్టులు, కేంద్ర రోడ్లు, రవాణా, హైవే మంత్రిత్వ శాఖ అధ్వర్యంలో పనులు వేగవంతం చేయడంపై ప్రధానంగా చర్చించారు. అందులో భాగంగానే హైదరాబాదు-బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్ (హెచ్‌బీఐసీ)లో భాగంగా కేంద్ర ప్రభుత్వం అభివృద్ధికి శ్రీకారం చుట్టిన ఓర్వకల్లు ఇండస్ట్రియల్ నోడ్ పరిధిలో జాతీయ రహదారులు అభివృద్ధి, రైల్వే లైన్ అనుసంధానంపై ప్రధానంగా చర్చించారు.

మిగతా 4వ పేజీలో

కర్నూలు, నంద్యాల జిల్లాల్లో 2014-19 కాలంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పారిశ్రామిక ప్రగతికి బీజం వేశారు. ఓర్వకల్లు కేంద్రంగా 33 వేల ఎకరాల్లో పారిశ్రామిక హబ్ ఏర్పాటు చేశారు. ప్రపంచంలోనే తొలి 1000 మెగావాట్ల అల్ట్రా మెగా సోలార్ యూనిట్ ఏర్పాటు చేశారు. జైరాజ్ ఇస్పాత్ స్టీల్ పరిశ్రమకు శంకుస్థాపన చేశారు. ప్రపంచంలోనే తొలి 3,680 మెగావాట్ల పంప్డ్ స్టోరేజ్ పవర్ ఉత్పత్తి యూనిట్ పునాది రాయి వేశారు. అయితే 2019 మేలో వచ్చిన జగన్ ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల పారిశ్రామిక ప్రగతి పడకేసింది. గతేడాది జూన్ 12న సీఎం చంద్రబాబు సారథ్యంలో టీడీపీ కూటమి ప్రభుత్వం మళ్లీ కొలువుదీరడంతో ఓర్వకల్లు ఇండస్ట్రియల్ హబ్‌కు మళ్లీ పూర్వవైభం వచ్చింది. హైదరాబాద్-బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్ (హెచ్‌బీఐసీ)లో భాగంగా ఓర్వకల్లు ఇండస్ట్రియల్ నోడ్ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టడం, భారీగా నిధులు ఇచ్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేసింది. హైదరాబాద్-బెంగళూరు మధ్యలో ఓర్వకల్లు ఉండడం, ఇక్కడ పుష్కలంగా ప్రభుత్వ భూమి ఉండడం కూడా కలసి వచ్చింది. ఇది దక్షిణ భారతదేశంలో రెండు ప్రధాన ఆర్థిక కారిడారులైన చెన్నై-బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్ (సీబీఐసీ), విశాఖపట్నం - చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ (వీసీఐసీ) మధ్య అనుబంధంగా కూడా పని చేస్తుంది. ఓర్వకల్లు ఇండస్ట్రియల్ నోడ్‌ను దాదాపు 4,742 ఎకరాల్లో అభివృద్ధి చేయనున్నారు. జాతీయ రహదారి (ఎన్‌హెచ్)-40 నుంచి మూడు ప్రధాన రహదారులను అనుసంధానం చేస్తుంది. దీంతో ఓర్వకల్లును పారిశ్రామిక పరుగులు పెట్టించేందుకు సీఎం చంద్రబాబు ప్రత్యేక కృషి చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం నిధులు రాబట్టి మౌలిక వసతులు కల్పన, పనులు చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.



ఓర్వకల్లు ఇండస్ట్రియల్ నోడ్‌కు రైల్వే, ఎన్‌హెచ్, ఎయిర్‌పోర్టులు అనుసంధానం చేసే మ్యాప్



గుట్టపాడు రోడ్డు

వీసీగా బాధ్యతలు చేపట్టిన చంద్రశేఖర్

కర్నూలు హాస్పిటల్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్‌గా కర్నూలు జీజీహెచ్‌కు చెందిన సీనియర్ కార్డియాలజిస్టు డాక్టర్ పి.చంద్రశేఖర్ శుక్రవారం ఉదయం విజయవాడలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని బోధనాసుపత్రుల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. రాష్ట్ర రాజధాని అమరావతిలో యూనివర్సిటీకి అనుబంధంగా మెడికల్ కాలేజీ, హాస్పిటల్‌ను ఏర్పాటు అవసరం ఉందన్నారు. వీసీగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం డాక్టర్ పి.చంద్రశేఖర్ గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ హెల్త్ వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ రాధికరెడ్డి, సీనియర్ గైనకాలజిస్టు డాక్టర్ వై.రాధిక సిబ్బంది ఉన్నారు.



గవర్నర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన వైస్ చాన్స్‌లర్ చంద్రశేఖర్

సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు దరఖాస్తుల వెల్లువ

కర్నూలు హాస్పిటల్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో ఉపాధ్యాయులు మెడికల్ క్యాంప్ సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు కుప్పలు తెప్పలుగా దరఖాస్తులు వస్తున్నాయి. ఈ నెల 24 నుంచి 26వ తేదీ వరకు కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల ధన్వంతరీ హాలులో మెడికల్ క్యాంప్ సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను జిల్లా విద్యాశాఖ అధికారులు ఏర్పాటు చేశారు. హాస్పిటల్ వైద్యులు మెడికల్ క్యాంప్‌ల ద్వారా పాతవాటిని, స్క్రూటినీ చేసి కొత్త దరఖాస్తులను పరిశీలిస్తారు. గతంలో 150 దరఖాస్తులు వచ్చేవి. సర్టిఫికెట్ల వెరిఫికేషన్ గతంలో రూ.5 వేల నుంచి రూ.20వేల దాకా ఆసుపత్రికి చెల్లించేవారు. కానీ ఈసారి ఫ్రీ సర్వీసు కింద పైసా ఖర్చు లేకుండా ఉపాధ్యాయులకు సర్టిఫికెట్లను ఇవ్వాలని డీఎంఈ నుంచి ఆదేశాలు జారీ వచ్చాయి. ఉచితం కావడంతో ఉపాధ్యాయులు భారీగా దరఖాస్తులు చేస్తున్నారు. ఈ నెల 24వ తేదీ 61 మంది, 25వ తేదీ 130 మంది సర్టిఫికెట్లను జారీ చేశారు. 26వ తేదీ దాదాపు 270 మంది దాకా దరఖాస్తులు చేసుకున్నట్లు తెలిసింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మెడికల్ క్యాంపులో జారీ చేసిన కొత్త సర్టిఫికెట్ల ఆధారంగానే త్వరలో ఉపాధ్యాయుల బదిలీ, ప్రత్యేక పాయింట్లు కేటాయిస్తారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఈ కేటగిరి టీచర్లు 500 దాకా ఉన్నారు. ఇందులో 20 శాతం మంది టీచర్లు ఇంకా మాన్యువల్ సర్టిఫికెట్లతో ఉన్నారు. ఇలాంటి వారిని వైద్యులు పరిశీలించి కొత్తగా సర్టిఫికెట్లు ఇస్తున్నారు. కొందరు టీచర్లకు 40 శాతం లోపం ఉండగా.. వైద్యులు పరిశీలించి చేసి దాన్ని 30 శాతంగా సర్టిఫికెట్లు ఇస్తున్నారు. గతంలో వైద్యులు 40 శాతం ఇస్తే ఇప్పుడు 30 శాతం ఇవ్వడంపై చాలా మంది ఉపాధ్యాయులు అధికారులతో వాగ్వివాదానికి దిగారు.



మెడికల్ క్యాంప్‌కు హాజరైన ఉపాధ్యాయులు


సౌత్ కొలనులో ఈత కొడుతున్న చిన్నారులు

వేసవిలో హాయిగా..

ఎండల నుంచి ఈత కొలను బిగ్ రిలీఫ్

డీఎస్‌డీఓ ఆధ్వర్యంలో శిక్షణ

ఆసక్తి చూపుతున్న నగర ప్రజలు

కర్నూలు స్పోర్ట్స్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మండు ఎండలో హాయిగా.. చల్లగా ఈతకొలనుకు వెళ్లాలనిపిస్తుంది. స్విమ్మింగ్ వేసవి ఉపశమనానికే కాకుండా, ఆరోగ్యదాయకం కూడా. పిల్లలు పెద్దలు అనే తేడా లేకుండా అందరూ ఈత కొలనుకు వెళితే ఆరోగ్యం సొంతమైనట్లే. కర్నూలు నగరంలో హంద్రీనది పక్కన కిసాన్ ఘాట్ వద్ద 1972లో ఈతకొలను ఏర్పాటు చేశారు. ఇక్కడ వందలు, వేల సంఖ్యలో రాష్ట్ర, జాతీయ స్థాయి స్విమ్మర్లు రాణించారు. భానుడి ప్రతాపంతో అల్లాడిన ప్రజానీకానికి ఈతకొలను తన ఒడిలో ఉపశమనం పొందమని ప్రత్యేక ఆహ్వానం పలుకుతుంది. గతంలో ఉన్న ఈత కొలను సామర్థ్యం దాదాపు 24 లక్షల లీటర్లు. ప్రస్తుతం 17 లక్షల సామర్థ్యానికి కుదించారు. దీంతో ప్రమాదాలు జరగవని క్రీడల అభివృద్ధి అధికారి బి.భూపతిరావు తెలిపారు. గతం కంటే కొలను లోతును మూడు అడుగులు తగ్గించారు. దీని వల్ల ఈత నేర్చుకునే వారికి సౌకర్యంగా ఉంటుంది. కోచ్‌తో పాటు క్రీడా సంస్థ ఉద్యోగులు ఈత నేర్చుకోనివారిని అనునిత్యం కనిపెట్టుకుని ఉంటారు. 10 సంవత్సరాల విద్యార్థుల కోసం లిటిల్ ఈతకొలను నిర్వహిస్తున్నట్లు భూపతిరావు తెలిపారు. వేసవిలో రద్దీని అనుగుణంగా అదనంగా పది మంది శిక్షకులను నియమించాలి.

ఫీజు వివరాలు

జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో కొనసాగున్న ఈ స్విమ్మింగ్‌పూల్‌లో నామమాత్రపు ఫీజు వసూలు చేస్తారు. ఈతకొలను మెయింటేన్స్ కోసం వాటిని వినియోగిస్తున్నట్లు అధికారులు వెల్లడిస్తున్నారు. 14 సంవత్సరాల బాలబాలికలకు ప్రత్యేక రుసం రూ.500 (అడ్మిషన్) ప్రతి నెల రూ.500 చెల్లించాలి. 14 సంవత్సరాలు పైబడిన వారు ప్రవేశ రుసుం రూ.1000, అలాగే ప్రతి నెలకు రూ.1000 చెల్లించాలి. సభ్యత్వం లేని వారు గంటకు రూ.100 చెల్లించాలి.

స్విమ్మింగ్ సమయాలు

ఉదయం 6 గంటల నుంచి 6:45 గంటల వరకు మొదటి బ్యాచ్, రెండో బ్యాచ్ 7 నుంచి 7:45 గంటల వరకు మూడో బ్యాచ్ 8 నుంచి 8:45 గంటల వరకు ఉంటుంది. సాయంత్రం 4 గంటల నుంచి 7 గంటల వరకు ఉంటుంది. మహిళలు ఈత నేర్చుకునేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

దరఖాస్తు ఇలా..

ఈత కొలను వద్ద కానీ, జిల్లా క్రీడా సంస్థ కార్యాలయంలో కానీ రూ.20 చెల్లించి దరఖాస్తు ఫారం తీసుకోవాలి. పూర్తి చేసిన దరఖాస్తుతో పాటు రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలు, ప్రభుత్వ వైద్యుడు నిర్ధారించిన ఫిట్‌నెస్ సర్టిఫికెట్లను అందజేయాలి. దరఖాస్తులో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యుల సంతకం తప్పనిసరి. స్విమ్మింగ్ పూల్‌ను ప్రతిరోజూ జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు పర్యవేక్షిస్తుంటారు. వేసవిలో ప్రతిరోజు వెయ్యి మందికి పైగా పాల్గొంటారని అంచనా వేశారు.


లర్నింగ్ చిన్నకొలనులో ఈత నేర్చుకుంటున్న చిన్నారులు


నార్త్ కొలనులో సెంటరు కొలనులో ఈత నేర్చుకుంటున్న చిన్నారులు

విద్యార్థులూ.. వేసవిలో ఈత నేర్చుకోండి



విద్యార్థులు వేసవిలో ఈత నేర్చుకోడానికి తల్లిదండ్రులు కూడా సహకరించాలి. అదనంగా 10 మంది స్విమ్మింగ్ లైఫ్ సేవర్స్‌ను వినియోగించుకుంటాం. కోచ్ మంచి శిక్షణ ఇస్తున్నారు. ఈత ఆరోగ్యానికి మంచిది. భవిష్యత్తులో స్విమ్మర్లను తయారు చేస్తాం.

– డీఎస్‌డీఓ భూపతిరావు



ఔటర్ రింగ్ రోడ్డుకు భూమిని సేకరించండి


మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్ బాషా, ఎస్పీ విక్రాంత్‌పాటిల్

కర్నూలు కలెక్టరేట్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): కోడుమూరు మండలంలోని పెద్దపాడు నుంచి హైదరాబాదు ఎన్‌హెచ్‌కు లింక్ చేస్తూ ఔటర్ రింగ్ రోడ్డు ఏర్పాటుకు సంబంధించిన భూసేకరణకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ రంజిత్ బాషా కర్నూలు మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో ఎస్పీ విక్రాంత్ పాటిల్‌తో కలిసి జిల్లా కలెక్టర్ డిస్ట్రిక్ట్ రోడ్డు సేఫ్టీ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఎంట్రన్స్, పార్కింగ్ ఏర్పాటు అంశాలపై వేగవంతంగా చర్యలు తీసుకోవాలని హాస్పిటల్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌ను ఆదేశించారు. ఎల్లమ్మ తల్లి గుడి దగ్గర అప్రోచ్ రోడ్డు కొరకు భూసేకరణ చేసి ఇచ్చి నెల అవుతుందని, అప్రోచ్ రోడ్డు పనులు వెంటనే మొదలు పెట్టాలన్నారు. ఆటోలో, సొంత వాహనాలలో కెపాసిటీకి మించి ఎక్కించుకుని ప్రయాణం చేసే వాహనదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డీటీసీను ఆదేశించారు. రాళ్లదొడ్డి వద్ద రోడ్డు విస్తరణ పనులకు సంబంధించి ఎస్‌హెచ్ ప్లాన్ కింద రూ.కోటి మంజూరయ్యాయని, వాటికి టెండర్లు పిలుస్తున్నామనీ ఆర్‌అండ్‌బీ ఎస్ఈ కలెక్టర్‌కు వివరించారు. ఎన్‌హెచ్, కడప పరిధిలో 16 బ్లాక్ స్పాట్‌లను గుర్తించడం జరిగిందని రూ.118లక్షలతో పనులు చేపడుతున్నామనీ, 60 రోజుల్లో పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామని ఎన్‌హెచ్ పీడీ, కడప కలెక్టర్‌కు వివరించారు. ఈ సమావేశంలో ఆర్‌అండ్‌బీ ఎస్ఈ మహేశ్వరరెడ్డి, పంచాయతీరాజ్ ఎస్ఈ రామచంద్రారెడ్డి, డీటీసీ శాంతకుమారి, ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ ఏవో సింధూ సుబ్రహ్మణ్యం, నేషనల్ హైవే పీడీలు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రం కోసం శ్రమిస్తున్న చంద్రబాబు

పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి


చంద్రబాబు నాయుడు చిత్ర పటానికి క్షీరాభిషేకం చేస్తున్న గౌరు చరితారెడ్డి, పత్తి ఓబులయ్య

కర్నూలు కల్చరల్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్ర అభివృద్ధి కోసం అహర్నిశలు శ్రమిస్తున్నారని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి అన్నారు. నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో కొనసాగుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు 75వ జన్మదిన వజ్రోత్సవ సాంస్కృతిక వారోత్సవాల్లో శుక్రవారం 'శాస్త్రీయ, జానపద, సినీ నృత్య లహరి' ప్రదర్శనలు, 'కళాకారులకు సత్కారాలు' నిర్వహించారు. ముందుగా చంద్రబాబు నిలువెత్తు ఫ్లెక్సీ చిత్రపటానికి పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య క్షీరాభిషేకం చేశారు. అనంతరం జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఓర్వకల్లులో ఇప్పటికే అనేక పరిశ్రమలు వచ్చాయని గుర్తు చేశారు. రాబోయే రోజుల్లో మరిన్ని పరిశ్రమలు జిల్లాల్లో ప్రారంభమవుతాయన్నారు. అందుకు రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ కృషి చేస్తున్నారని అన్నారు. టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు, కళారత్న పురస్కార గ్రహీత పత్తి ఓబులయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా కర్నూలు నగరంలో చంద్రబాబు జన్మదిన వజ్రోత్సవ సాంస్కృతిక వారోత్సవాలు వారం రోజుల పాటూ కన్నుల పండువగా నిర్వహిస్తున్నామని తెలిపారు. జిల్లాలోని అన్ని రంగాల వారికి ప్రోత్సాహకాలు అందించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నృత్య గురువులు నారాయణస్వామి, ఎస్.కరీముల్లా, రోహిత్, నాగసాయి ప్రదీప్‌లను, భానుస్వామిలను ఎమ్మెల్యే సత్కరించారు. ఈ కార్యక్రమంలో కళాక్షేత్రం సభ్యులు మహమ్మద్ మియా, సీవీ రెడ్డి, శివయ్య, ఎస్ఎండీ ఇనాయతుల్లా, ఎర్రమ పాండురంగయ్య, రాజారత్నం, యాగంటీశ్వరయ్య, సంగా ఆంజనేయులు, వాల్మీకి రాముడు, గాండ్ల లక్ష్మన్న, సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన నృత్య విభావరి : చంద్రబాబు నాయుడు 75వ జన్మదిన వజ్రోత్సవ సాంస్కృతిక వారోత్సవాల్లో నిర్వహించిన జానపద, శాస్త్రీయ, సినీ నృత్య విభావరి ప్రేక్షకులను అసాంతం అకట్టుకుంది. కూచిపూడి, భరతనాట్యం నృత్య గురువులు నారాయణస్వామి, ఎస్.కరీముల్లా, రోహిత్, నాగసాయి ప్రదీప్‌ల ఆధ్వర్యంలో నృత్య కళాకారులు వివిధ రూపకాలపై ఆకట్టుకునేలా ప్రదర్శనలు చేశారు.

నేడు శ్రీవేంకటేశ్వర మహాత్యం నాటకం : టీజీవీ కళాక్షేత్రంలో శనివారం ఏడోరోజు వజ్రోత్సవ వారోత్సవాల చివరి రోజు కార్యక్రమంలో భాగంగా శనివారం సాయంత్రం 6 గంటలకు 'శ్రీ వెంకటేశ్వర మహాత్యం' భక్తిరస పద్య నాటకం ప్రదర్శిస్తున్నారు. టీజీవీ కల్చరల్ అకాడమీ ఆధ్వర్యంలో ప్రదర్శిస్తున్న ఈ నాటకానికి అకాడమీ అధ్యక్షుడు, ప్రముఖ నాటక దర్శకుడు, సీనియర్ రంగస్థల నటుడు వీవీ రమణారెడ్డి దర్శకత్వం వహిస్తున్నారు. శారదా ప్రసన్న ఈ నాటకం రాశారని పత్తి ఓబులయ్య తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ హాజరవుతారని ఆయన తెలిపారు.

ప్రగతిలో రహదారి



ఓర్వకల్లు ఇండస్ట్రియల్ నోడ్‌కు పరిధిలో కొత్తగా ప్రతిపాదించిన ఎసెన్షియల్ ఎక్స్‌టర్నల్ రోడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మ్యాప్

3వ పేజీ తరువాయి

ఓర్వకల్లు నోడ్ పరిధిలోని ఉప్పలపాడు-ఉశేనాపురం జిల్లా రహదారి (డీఆర్) 8 కిలోమీటర్లు రూ.72 కోట్లతో, ఉప్పలపాడు-రామళ్లకోట జిల్లా రహదారి 15 కిలోమీటర్లు రూ.135 కోట్లతో, గుట్టపాడు - బ్రహ్మణపల్లి జిల్లా రోడ్డు 9 కిలోమీటర్లు రూ.80 కోట్లతో మొత్తం 32 కిలో మీటర్లు రూ.207 కోట్లతో నాలుగు వరుసల జాతీయ రహదారిగా ఆధునికీరణపై ప్రధానంగా చర్చించారు. ఈ పనులు చేపట్టేందుకు ఇప్పటికే నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్ఏఐ)కు రాష్ట్ర ప్రభుత్వం లేఖ రాసింది. ఈ మూడు రోడ్లలో ఇప్పటికే గుట్టుపాడు నుంచి ఎన్‌హెచ్-40 రోడ్డు వరకు కొంత భాగం ఎన్‌హెచ్ఏఐ తీసుకున్నట్లు ఆ శాఖ అధికారులు మంత్రికి వివరించారు. తక్షణమే పనులు చేపట్టాలని సబంధిత శాఖ ఇంజనీర్లను ఆదేశించారు వీటితో పాటు బేతంచర్లలో రైల్వే సబ్‌వే నిర్మాణం పనులు ప్రారంభించాలని రైల్వే అధికారులను ఆదేశించారు.

ఓర్వకల్లుకు చేరువలో...

ఓర్వకల్లు ఇండస్ట్రియల్ నోడ్‌కు చేరువలోనే జాతీయ రహదారులు, రైల్వేలైన్లు, విమానాశ్రాయాలు ఉన్నాయని మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి సమీక్ష సమావేశంలో ఆయా శాఖల అధికారులు వివరించారు. ఓర్వకల్లుకు 4 కి.మీల దూరంలో కర్నూలు-రాణిపేట జాతీయ రహదారి (ఎన్‌హెచ్)-40, 28 కి.మీల దూరంలో కర్నూలు నుంచి అనంతపురం నేషనల్ హైవే-44 రోడ్డు, 26 కి.మీల దూరంలో కర్నూలు-దోర్నాల నేషనల్ హైవే-340సీ రోడ్లు ఉన్నాయి. 35 కి.మీల దరంలో కర్నూలు, 49 కి.మీల దూరంలో నంద్యాల రైల్వే స్టేషన్లు, 49 కి.మీల దూరంలో డోన్ రైల్వే జంక్షన్ ఉంది. 12 కి.మీల దూరంలో కర్నూలు (ఓర్వకల్లు) విమానాశ్రయం, 171 కి.మీల దూరంలో కపడ ఎయిర్ పోర్టు, 233 కి.మీల దూరంలో శంషాబాద్, హైదరాబాద్ విమానాశ్రాయలు ఉన్నాయి. 320 కి.మీల దూరంలో కృష్ణపట్నం ఓడరేవు, 420 కి.మీల దూరంలో కట్టుపల్లి పోర్టు ఉన్నాయని 2వ టాస్క్ ఫోర్స్ కమిటీ సమావేశం చర్చించడం జరిగింది.


2,612 ఎకరాల్లో రూ.2,786 కోట్లతో వసతులు:

ఇప్పటికే ఓర్వకల్లు ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీ 2,612 ఎకరాల్లో రూ.2,786 కోట్లతో అభివృద్ధి చేస్తామని ఈ ఏడాది జూన్ 23న కేంద్రం ప్రకటించింది. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలాసీతారామన్ కేంద్ర బడ్జెట్-2024-25లో కీలక ప్రకటన చేశారు. నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ (ఎన్ఐసీడీపీ)లో భాగంగా ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీల అభివృద్ధికి కేంద్రం ఆమోదం తెలిపింది. ఫేజ్-1 కింద 2,612 ఎకరాల్లో ఓర్వకల్లు ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీలో రూ.2,786 కోట్లతో మౌలిక వసతులు కల్పన ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. నాన్ మెటలిక్ మినరల్ పరిశ్రమలు, ఆటోముబైల్ రంగం విడిభాగాలు తయారీ, పునరుత్పాదక పరిశ్రమలు, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్ పరికరాలు, ఏరోస్పెస్ అండ్ డిఫెన్స్ హార్డ్‌వేర్, ఫార్మాస్యూటికల్స్, వజ్రాలు, బంగారు అభరాలు తయారీ, వస్త్ర ఉత్పత్తి రంగ పరిశ్రమలు ఇక్కడే ఏర్పాటు చేసేందుకు నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్ఐసీడీసీ) ప్రత్యేక దృష్టిని పెట్టింది. ఆయా పరిశ్రమలు ఏర్పాటు ద్వారా రూ.12 వేల కోట్లు పెట్టుబడులు, 45,071 మంది యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని అంచనా వేశారు. తాజాగా రాష్ట్ర పెట్టుబడులు, మౌళిక వసతుల శాఖ మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి జాతీయ రహదారులు, రైల్వే ప్రాజెక్టులు ఏర్పాటుపై చర్చించడం ప్రాధాన్యత సంతరించుకుంది.

చిన్నారి సాయి చిత్రకళా వైభవం

● కోటేశ్ ఆర్ట్ అకాడమీలో శిక్షణ ● పదో తరగతిలోనే పలు విజయాలు


మెడల్స్, పతకాలు, సర్టిఫికెట్స్‌తో సాయి భవతి






నంద్యాల కల్చరల్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): ఆలోచనలో నవ్యత, రేఖల్లో సృజనాత్మకత, రంగులో ఆకర్షణ.. చిన్నారి సాయి భవతి కుంచె నుంచి జాలువారుతున్నాయి. జాతీయ, అంతర్జాతీయ చిత్రలేఖన పోటీల్లో పలు పతకాలు, అవార్డ్స్ సాధించి ప్రత్యేక గుర్తింపు పొందింది. నంద్యాలకు చెందిన పల్లా రమేష్, స్వర్ణ దంపతుల కుమార్తె సాయి భవతి 10వ తరగతి చదువుతోంది. పసిప్రాయంలోనే పలకలపై, పుస్తకాలపై ఏవేవో బొమ్మలు గీస్తూ మురిసిపోయేది. ఇది గమనించి తల్లిదండ్రులు రంగులు, పుస్తకాలు ఇచ్చి ప్రోత్సహించారు. కోటేష్ ఆర్ట్ అకాడమీలో శిక్షణ ఇప్పిస్తున్నారు. అక్కడ తన సృజనాత్మకతకు మెలకువలు నేర్చుకున్నది. చిత్రకళలో నిత్యం సాధన చేసి చక్కని బొమ్మలు గీస్తోంది. కలర్ పెన్సిల్ వర్క్, క్రేయాన్స్ వర్క్, వాటర్ కలర్స్, కాన్వాసు పెయింటింగ్స్ ఇలా అన్ని పద్ధతుల్లో బొమ్మలు గీస్తోంది. తన బొమ్మల్లో పర్యావరణ, ప్లాస్టిక్ వినియోగంవల్ల నష్టాలు, కాలుష్య నివారణ చైతన్యం, నీటి సంరక్షణ వంటి సామాజిక కోణాలను ప్రతిబింబిస్తోంది. సాయి భవతి వేసిన చిత్రాలకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఎన్నో పతకాలు వచ్చాయి. కాన్వాసు పెయింటింగ్స్‌లో చాలా అద్భుతమైన బొమ్మలు వేసింది. అర్ధనారీశ్వరుడు, నందీశ్వరుడు, గణపతి, శ్రీరామపట్టాభిషేకం వంటి దేవతా మూర్తుల బొమ్మలు వేసింది. పల్లె పడుచులు, చత్రపతి శివాజీ, హంస, చిరుత ఇలా ఎన్నో చిత్రాలు కాన్వాసుపై అద్భుతంగా వేసింది.

సాయి భవతి సాధించిన విజయాలు

- 2021లో మహారాష్ట్రలోని నాసిక్ స్వామి వివేకానంద ఎడ్యుకేషన్ సంస్థవారు నిర్వహించిన అంతర్జాతీయ స్థాయి చిత్ర కళా ప్రదర్శనలో స్వర్ణ పతకం సాధించింది.
- 2021లో తూర్పుగోదావరి జిల్లా అమలాపురంలోని కోనసీమ చిత్రకళా పరిషత్ వారు నిర్వహించిన అంతర్జాతీయ చిత్రకళా పోటీల్లో బంగారు పతకం..
- 2022లో యంగ్ ఇన్వోస్ సంస్థ ఆధ్వర్యంలో జరిగిన అంతర్జాతీయ చిత్రకళా పోటీల్లో రజత పతకం..
- 2023 గుంటూరు జిల్లాలోని క్రియేటివ్ ఆర్ట్ అకాడమి, ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో జరిగిన జాతీయస్థాయి చిత్రలేఖన పోటీల్లో బంగారు పతకం..
- 2023 నెల్లూరులో అమీర్ ఆర్ట్ అకాడమీ వారు నిర్వహించిన జాతీయస్థాయి చిత్రకళా పోటీల్లో బంగారు పతకం..
- 2023లో పల్నాడు జిల్లా వినుకొండలో బెజవాడ చారిటబుల్ ట్రస్ట్ వారు నిర్వహించిన జాతీయస్థాయి చిత్రలేఖన పోటీల్లో బంగారు పతకం..
- 2023లో విజయవాడలోని డ్రీమ్ ఆర్ట్ అకాడమీ వారు నిర్వహించిన జాతీయస్థాయి చిత్రకళ పోటీల్లో బంగారు పతకం..
- 2024లో విజయవాడలోని ప్రోగ్రెస్ ఆఫ్ బడ్స్ సంస్థ వారు నిర్వహించిన అంతర్జాతీయ స్థాయి చిత్రకళ పోటీల్లో బంగారు పతకం.. సాధించింది.

ప్రతిభ PRATIBHA



సాయి భవతి వేసిన చిత్రాలు

జీజీహెచ్‌లో నిలువు దోపిడీ

- కోట్లాది రూపాయల విద్యుత్ బిల్లులు బకాయి
- ప్రభుత్వం నుంచి దర్జాగా బిల్లులు చేసుకుంటున్న వైనం
- ఎన్నార్బై అకాడమీ నుంచి బిల్లులు వసూలు చేసేదెవరు ?
- గత వైసీపీ ప్రభుత్వం నుంచి రూపాయి కూడా చెల్లించని విద్యుత్ శాఖ


నంద్యాల జీజీహెచ్‌లో ఏర్పాటు చేసిన ఎం.ఆర్.ఐ. స్కానర్


సిటీ స్కానర్

నంద్యాల హాస్పిటల్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా ఆస్పత్రిలో అయిదేళ్ల క్రితం అప్పటి వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎంఆర్ఐ, సిటీ స్కానర్లు ఏర్పాటు చేశారు. వాటి నిర్వహణ ఎన్నార్బై అకాడమి ఆఫ్ సైన్స్ సంస్థకు కట్టబెట్టారు. ఎమ్మార్బై, సిటీ స్కాన్లు ప్రారంభమైనప్పటి నుంచి ఇంతవరకు ఒక్క రూపాయి కూడా కరెంటు బిల్లు చెల్లించకపోవడం గమనార్హం. గత వైసీపీ ప్రభుత్వం చేసిన పాపం ప్రస్తుతం నంద్యాల సర్వజన ప్రభుత్వ ఆస్పత్రికి చుట్టుకుంది. ఇప్పటి వరకు దాదాపు కోటి పదిహేను లక్షల రూపాయల విద్యుత్ బకాయిలు ఉన్నాయంటే అధికారుల పనితీరు ఇట్టే తెలుస్తోంది. ఎన్నార్బై అకాడమీ సంస్థకు చెల్లించాల్సిన డబ్బును అప్పనంగా చెల్లిస్తున్నారేకాని విద్యుత్ బకాయిలు మాత్రం వసూలు చేసుకోవడంలో అధికారుల నిర్లక్ష్యానికి ప్రస్తుతం పేరుకుపోయిన విద్యుత్ బిల్లులే నిదర్శనమని చెప్పవచ్చు. నంద్యాల జీజీహెచ్‌లో ఎమ్మార్బై, సిటీ స్కాన్ల కోసం ప్రత్యేకంగా ట్రాన్స్‌పార్మర్, సబ్ మీటర్ ఏర్పాటు చేశారు. సబ్ మీటర్‌లో వచ్చిన రీడింగ్‌కు యూనిట్‌కు రూ.10చొప్పున జీజీహెచ్ చార్జి చేస్తోంది. వైసీపీ హయాంలో ఎమ్మార్బై, సిటీ స్కాన్ నిర్వహణ వైసీపీ అనుయాయులకు కట్టబెట్టారు. ఎన్నార్బై అకాడమి ఆఫ్ సైన్స్ సంస్థ నుంచి నంద్యాలకు చెందిన ఓ మందుల దుకాణం యజమానికి ఏడు శాతం, ఆత్మకూరు వైసీపీ నాయకుడికి నలభై శాతం, నంద్యాలలోని ఓ వైద్యుడికి 53 శాతం వాటాతో నంద్యాల ప్రభుత్వ ఆస్పత్రిలో ఎమ్మార్బై, సిటీ స్కాన్ల నిర్వహణ దక్కించుకున్నారు.

దాదాపు మూడేళ్లు వీరు నిర్వహించగా అప్పట్లో కూడా విద్యుత్ బిల్లులు చెల్లించలేదు. అనంతరం ఎన్నార్బై అకాడమే స్వయంగా వీటి నిర్వహణ ఇప్పటి వరకు చేస్తోంది. జీజీహెచ్‌కు ప్రతిరోజు దాదాపు 40 ఎమ్మార్బై స్కాన్లు, 60కిపైగా సిటీ స్కాన్లు చేస్తున్నారు. ఈ లెక్కన నెలకు వెయ్యికిపైగా ఎమ్మార్బై స్కాన్లు, 1500కుపైగా సిటీ స్కాన్లు చేస్తున్నారు. అప్పటి ప్రభుత్వం ఎమ్మార్బైకి రూ.2650, సిటీ స్కాన్‌కు రూ.1060 చెల్లించేలా ఒప్పందం చేసుకుంది. గత అయిదేళ్లనుంచి ఒప్పందం ప్రకారం ప్రభుత్వం నుంచి కోట్లాది రూపాయలు ఆర్జిస్తున్నా ఎన్నార్బై అకాడమీ సంస్థ ఇప్పటి వరకు విద్యుత్ బిల్లు చెల్లించక పోవడం గమనార్హం.

ఒక రోజుకు చేస్తున్న పరీక్షలు
ఎంఆర్ఐ స్కాన్ 30 - 40 సిటీ స్కాన్ 60 - 70
రెండింటికి ప్రభుత్వం చెల్లించే డబ్బు దాదాపు రూ.5లక్షలు
నెలకు విద్యుత్ బిల్లు దాదాపు రూ.2లక్షలు

నంద్యాల జీజీహెచ్ నుంచి పలుమార్లు విద్యుత్ బిల్లు చెల్లించాలని నోటీసులు ఇచ్చిన ఎన్నార్బై అకాడమి ఆఫ్ సైన్స్ సంస్థ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించింది. 15-05-2019నుంచి 16-08-2019వరకు మూడు నెలల బిల్లు రూ.3,29,400 నోటీసు పంపారు. అలాగే 6-09-2024నుంచి 12-11-2024వరకు రూ.4,01,600 విద్యుత్ బకాయిలున్నట్లు చివరగా నోటీసు పంపారు. ఎమ్మార్బై, సిటీ స్కాన్లు స్థాపించినప్పటి నుంచి 12-11-2024 వరకు మొత్తం విద్యుత్ బకాయిలు రూ.97,54,610 ఉన్నాయి. ప్రస్తుత ఆరు నెలలకు సంబంధించిన విద్యుత్ బకాయిలు దాదాపు రూ.15లక్షల వరకు ఉండ వచ్చని అంచనా. ప్రభుత్వ సంస్థ కాబట్టి విద్యుత్ అధికారులు కూడా బకాయిల వసూళ్లపై ఒత్తిడి తేవడంలేదని తెలుస్తోంది. ప్రజా ప్రయోజనాల కోసం ఏర్పాటు చేసిన జీజీహెచ్‌కు నిరంతర విద్యుత్ ఇవ్వాలనేది విద్యుత్ అధికారుల ఆలోచన. అయితే ఇదే అదనుగా చేసుకొని ఎన్నార్బై అకాడమి కోట్లాది రూపాయలు గడిస్తున్నా విద్యుత్ బకాయిలు చెల్లించకపోవడం పట్ల ఆస్పత్రి వర్గాలు మౌనంగా ఎందుకు ఉన్నాయన్నది చర్చనీయాంశమైంది.

ఎన్నార్బై అకాడమీ చెల్లింపులు నా దృష్టికి రాలేదు



జీజీహెచ్‌లో ఎంఆర్ఐ, సిటీ స్కాన్ల నిర్వహణ చేస్తున్న ఎన్నార్బై అకాడమీ ఆఫ్ సైన్స్‌కు బిల్లుల చెల్లింపు విషయం నా దృష్టికి రాలేదు. ఫిబ్రవరిలో జీజీహెచ్ అసిస్టెంట్ డైరెక్టర్‌గా చార్జి తీసుకున్నాను. విద్యుత్ బకాయిల చెల్లింపు విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి చర్యలు తీసుకుంటాం. **- డా. మస్తాన్, అసిస్టెంట్ డైరెక్టర్, జీజీహెచ్, నంద్యాల.**

స్పందన నుంచి సమస్య లోక్ అదాలత్‌కు

కర్నూలు లీగల్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): గత ఏడాదిగా స్పందనలో పరిష్కారం కాని వివాదాన్ని నెల రోజుల్లో తాము పరిష్కరించినట్లు శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ వెంకట హరినాథ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కల్లూరు మండలం పందిపాడు గ్రామంలో తమ ఇంటి ముందు డ్రైనేజీ నీటి కాలువలో చెత్త పేరుకుపోయి తీవ్ర అనారోగ్యాలకు కారణమవుతుందని శ్రీరాములు 2023లో స్పందనలో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ఆయనతో పాటు కాలనీ ప్రజలు కర్నూలు మున్సిపల్ కమిషనర్‌కు, కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కానీ సంబంధిత అధికారులు పట్టించుకోలేదు. దీంతో ఫిర్యాది శాశ్వత లోక్ అదాలత్‌ను ఆశ్రయించాడు. ఈ మేరకు శాశ్వత లోక్ అదాలత్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌కు నోటీసులు జారీ చేయడంతో వారు వెంటనే స్పందించి ఫిర్యాది ఇంటి ముందు నిల్చుని వున్న మురుగురె తొలగించారు. ఫిర్యాదికి మున్సిపల్ అధికారులు రూ.10వేల నష్టపరిహారాన్ని కూడా చెల్లించాలని తీర్పునిచ్చినట్లు శాశ్వత లోక్ అదాలత్ అధ్యక్షుడు ఎం.వెంకట హరినాథ్ ఒక ప్రకటనలో తెలిపారు.

గుండెపోటుతో ఉపాధి కూలీ మృతి

కోడుమూరు రూరల్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లద్దగిరి గ్రామంలో గుండెపోటుతో ఉపాధి శ్రామికుడు చిన్నరాముడు (36) మృతి చెందాడు. గ్రామానికి చెందిన ఈయన (జాబ్‌కార్డు- 011815) శుక్రవారం ఉదయం స్థానిక ఊటుకుంటవాగు సమీపంలో ఉపాధి పథకం కింద చేపట్టిన కాలువ పూడికతీత పనులకు వెళ్లాడు. హాజరు వేసుకుని పనికి ఉపక్రమిస్తున్న క్రమంలో కళ్లు తిరిగి కిందపడిపోయాడు. దీంతో ఆందోళన చెందిన తోటి శ్రామికులు చిన్నరాముడును బైక్‌పై తీసుకుని స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతదేహాన్ని ఇంటికి చేర్చారు. సమాచారం అందుకున్న ఏపీవో మోదీన్‌బాషా, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు, టీఏ శ్రీనివాసరాజు, ఎఫ్ఏ మహబూబ్‌బాషా మృతదేహంపై పూలమాల వేసి నివాళి అర్పించారు. టీడీపీ నాయకులు పట్టి మధు, గుడిసె జయన్న, రామాంజనేయులు కుటుంబసభ్యులను పరామర్శించారు.

వైసీపీ నాయకుడి హత్య


పెద్ద వెంకటేశులు (ఫైల్)

హాలహర్వి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అమృతాపురం గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు పెద్ద వెంకటేశులు (50) హత్యకు గురయ్యాడు. ఎస్ఐ చంద్ర తెలిపిన మేరకు. పెద్ద వెంకటేష్ పొలం పనికి వెళ్లి సాయంత్రమైన తిరిగి రాలేదు. బంధువులు సాయంత్రం పొలానికి వెళ్లి చూడగా మృతదేహం కనిపించింది. దీంతో పోలీసులకు సమాచారం అందించడంతో సీఐ రవి శంకర్ రెడ్డి, హాలహర్వి పోలీసులు మృతదేహాన్ని పరిశీలించారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. అయితే హత్యకు కారణాలు తెలియాల్సి ఉంది.

రైతు మృతి

కర్నూలు (క్రైం), 25 (ఆంధ్రజ్యోతి): ఉలిందకొండ పోలీస్ స్టేషన్ పరిధిలో లక్ష్మీపురం గ్రామంలో ఆత్మహత్యాయత్నం చేసిన రైతు ఎర్రమల(51) ఆస్పత్రిలో శుక్రవారం మృతి చెందాడు. గ్రామానికి చెందిన ఎర్రమల తన సొంత పొలం నాలుగెకరాలతో పాటు మరో పది ఎకరాలు కౌలుకు తీసుకుని వ్యవసాయం సాగుచేస్తున్నాడు. పొలంలో పంట దిగుబడులు సరిగా రాకపోవడంతో అప్పులు పెరిగాయి. కొన్నేళ్లుగా తాను పెంచుకున్న ఎద్దులను ఇటీవల అప్పులు తీర్చేందుకు అమ్మేశాడు. అయినా అప్పులు తీరకపోవడంతో మనస్తాపానికి గురై ఆదివారం ఇంట్లో పురుగుల మందు తాగి ఆత్మహత్యయత్నం చేశాడు. బంధువులు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ధనుంజయ తెలిపారు.

కానిస్టేబుల్ ఆత్మహత్యాయత్నం

నంద్యాల టౌన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): నంద్యాల హెడ్ క్వార్టర్స్‌లో పని చేస్తున్న ఏఆర్ కానిస్టేబుల్ చిన్నికృష్ణ శుక్రవారం ఆత్మహత్యాయత్నం చేశారు. నంద్యాల పట్టణ శివారుల్లోని శివగార్డెన్ సమీపంలో గడ్డి మందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లిన ఆయనను స్థానికులు గుర్తించి పట్టణంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఆయనది సొంతూరు అవుకు. అయితే ఆత్మహత్యాయత్నానికి గల కారణాలు తెలియరాలేదు.

పొగాకు దగ్ధం

పాములపాడు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇస్కాల గ్రామం శివారులో రైతులు తాము పండించిన పొగ పంటను కట్టలు కట్టి ఆరబెట్టుకున్నారు. అయితే ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో గుర్రం వెంకటేశ్వర్లుకు చెందిన 30 క్వింటాళ్లు, సోమేశ్వరుడు 10 క్వింటాళ్లు, తెలుగు రాముకు చెందిన 10 క్వింటాళ్లు, బన్నూరు శివకు చెందిన 10 క్వింటాళ్ల పొగాకు కాలిపోయింది. చుట్టు పక్కల రైతులు స్పందించి బావిలోని నీటిని మోటార్ల ద్వారా మంటలను అదుపు చేశారు. దీంతో చుట్టుపక్కల రైతుల పొగాకుకు ప్రమాదం తప్పింది. రూ.15 లక్షలకు పైగా నష్టం వాటిల్లినట్లు బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.


మంటలను ఆర్పుతున్న స్థానికులు

బంగారం పేరుతో మోసం

- నిందితుడి అరెస్టు
- రూ.45.91లక్షల రికవరీ


నిందితుడి వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

కర్నూలు క్రైం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): తక్కువ ధరకు బంగారం ఇప్పించి, ఎక్కువ ధరకు అమ్మిస్తామని నమ్మించి రూ.48.50 లక్షలు మోసం చేసిన కేసులో నిందితుడు రంగు నాగేష్ అలియాస్ నాగిరెడ్డిని పోలీసులు అరెస్టు చేశారు. డీఎస్పీ బాబు ప్రసాద్, టూటౌన్ సీఐ నాగరాజరావు, త్రీటౌన్ సీఐ శేషయ్య శుక్రవారం నిందితుని వివరాలు వెల్లడించారు. హైదరాబాదు సరూర్‌నగర్‌కు చెందిన సంతోషిమాత అనే మహిళకు నిందితుడు మాయ మాటలు చెప్పి నమ్మించాడు. రూ.60 లక్షలు డబ్బులు ఇస్తే. కేజీ బంగారం కొని మళ్లీ అదే బంగారాన్ని రూ.90 లక్షలకు అమ్మిస్తానని.. రూ.30 లక్షలు లాభం వస్తుందని, కొద్దిపాటి లాభం తనకు ఇస్తే సరిపోతుందని చెప్పాడు. దీంతో మహిళ సంతోషిమాత తన భర్త శ్రీశైలంలో కొద్దిరోజుల కింద ఇల్లు అమ్మగా వచ్చిన మొత్తం రూ.48.50 లక్షలు తీసుకుని నిందితుడ్ని సంప్రదించింది. ఏప్రిల్ 19వ తేదీన కర్నూలు రావాలని సూచించడంతో ఆమె, ఆమె భర్త ఇద్దరు కలిసి కర్నూలు వచ్చారు. భార్యాభర్తలు సాయిబాబా ఆలయం వద్ద ఉండి బంగారం కొనే సమయంలో ఎవరూ ఉండకూడదని నమ్మించి కారులో వారి డబ్బులు తీసుకుని వెళ్లిపోయాడు. కొత్తబస్టాండు చేరుకుని అక్కడ కారు వదిలేసి బస్సులో వెళ్లిపోయాడు. ఆ తర్వాత నిందితుడు ఎప్పటికీ రాకపోవడంతో బాధితులు అనుమానం వచ్చి ఫోన్ చేశారు. ఫోన్ స్విచ్ఛాఫ్ రావడంతో మోసపోయామని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి నిందితుడ్ని పట్టుకున్నారు. నిందితుని వద్ద నుంచి 45.91 లక్షలు రికవరీ చేశారు.

ఎంపీడీవోలుగా పదోన్నతులు

కర్నూలు న్యూసిటీ, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లాలో పని చేస్తున్న పరిపాలన అధికారులు/డిప్యూటీ ఎంపీడీవోలకు.. ఎంపీడీవోలుగా పదోన్నతులు కల్పిస్తూ పంచాయతీరాజ్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ కృష్ణతేజ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు జిల్లాకు సంబంధించిన పరిపాలన అధికారులు/డిప్యూటీ ఎంపీడీఓలను కర్నూలు జిల్లాతో పాటు శ్రీసత్యసాయి, అనంతపురం జిల్లాలకు కేటాయించారు.

పేరు	ప్రస్తుతం	కేటాయింపు
బీవీ రమణారావు	ఏవో, డ్వామా, కర్నూలు	కర్నూలు
ఆర్. పార్థసారధి	ఏవో, ఉయ్యాలవాడ	శ్రీసత్యసాయి
జి.కరుణాసాగర్	ఏవో, కొత్తపల్లి	శ్రీసత్యసాయి
బి.నూర్జహా	ఏవో, జూపాడుబంగ్లా	కర్నూలు
కే.విజయశేఖర్‌రావు	ఏవో, ఆదోని	కర్నూలు
వి.విజయసింహారెడ్డి	ఏవో, గూడూరు	అనంతపురం
ఎం.బాలకృష్ణుడు	డిప్యూటీ ఎంపీడీవో, ప్యాపిలి	శ్రీసత్యసాయి
ఎం.సూర్యనారాయణ	డిప్యూటీ ఎంపీడీవో, దేవనకొండ	అనంతపురం
జి.ప్రభావతిదేవి	డిప్యూటీ ఎంపీడీవో, మంత్రాలయం	కర్నూలు
ఏ.మద్దిలేటి స్వామి	డిప్యూటీ ఎంపీడీవో మద్దికెర	కర్నూలు

మాజీ మంత్రి బుగ్గనపై విచారణ జరపాలి


మాట్లాడుతున్న మన్నె రమణ

డోన్ రూరల్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సంచలనం సృష్టిస్తున్న మద్యం కుంభకోణంలో రాష్ట్ర మాజీ ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి పాత్రపై కూడా సమగ్ర విచారణ జరపాలని డోన్ టీడీపీ నాయకుడు మన్నె రమణ డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని ఆయన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో జరిగిన భారీ మద్యం కుంభకోణం వ్యవహారంలో అప్పటి ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి పాత్ర కూడా ఉంటుందని తాము భావిస్తున్నామన్నారు. అలాగే గత ఎన్నికల సమ యంలో మాజీ మంత్రి బుగ్గనపై చేసిన ఆరోపణలకు తాము ఇప్పటికీ కూడా కట్టుబడి ఉన్నామన్నారు. డోన్ నియోజకవర్గంలో జరిగిన పనులలో అవకతవకలు, వాటిలో ఆయనకు ఎంత లబ్ధి చేకూరిందనే విషయా లపై కూడా సీఎం చంద్రబాబు సమగ్ర విచారణ చేయాలని కోరారు. వచ్చే సోమవారం విజయవాడలో చీఫ్ అధికారులను కలిసి వినతిపత్రం ఇస్తున్నట్లు తెలిపారు.

పశుగ్రాసానికి నిధులు

- ఉమ్మడి జిల్లాలో 20వేల ఎకరాల్లో గ్రాసం పెంపు
- ఉపాధి నిధులతో పశువులకు పుష్కలంగా మేత



కర్నూలు అగ్రికల్చర్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత వేసవిలో రైతులు పాడి పశువుల పోషణ భారం భరించలేకపోతున్నారు. పశువులను పస్తులు పెట్టలేక సంతకు తీసుకెళ్లి కబేళాలకు విక్రయిస్తున్నారు. ఈ పరిస్థితులను గుర్తించిన కూటమి ప్రభుత్వం పాడి పశువులకు సమృద్ధిగా గ్రాసం (గడ్డి) అందించేందు కోసం ఉపాధి నిధులను పెద్ద ఎత్తున వినియోగించేందుకు చర్యలు తీసుకుంది. గతంలో వైసీపీ ప్రభుత్వం జిల్లా వేయి ఎకరాల్లో మాత్రమే గ్రాసాన్ని పెంచేందుకు ఉపాధి నిధులను నామమాత్రంగా వినియోగించింది. దీంతో గ్రాసం తగినంత అందుబాటులో లేక వ్యాపారుల నుంచి కొనుగోలు చేయలేక అప్పట్లో రైతులు పాడి పశువులను సంతలకు తీసుకెళ్లి అమ్మేసేవారు. కూటమి ప్రభుత్వం రావడంతో పెద్ద ఎత్తున గ్రాసం పెంపకానికి ఉపాధి నిధులు వెచ్చించడం ద్వారా ప్రస్తుత వేసవిలో పాడిగేదెలకు పూర్తి స్థాయిలో గ్రాసాన్ని అందుబాటులో తెచ్చేందుకు ఏర్పాట్లు చేసింది. 10 సెంట్ల నుంచి 50 సెంట్ల విస్తీర్ణంలో గ్రాసాన్ని పెంచుకునే రైతులకు రూ.33వేలు ఉపాధి హామీ పథకం ద్వారా ఉచితంగా అందించేందుకు ఉత్తర్వులు జారీ చేసినట్లు అధికార వర్గాలు తెలిపాయి. ఒక్కో మండలానికి 300 ఎకరాల చొప్పున పశుగ్రాసాన్ని పెంచేందుకు లక్ష్యాన్ని పశుసంవర్థక శాఖకు నిర్దేశించింది. కర్నూలు, నంద్యాల జిల్లాలో వర్షాభావ పరిస్థితులు ఎదుర్కొంటున్న మండలాల్లో పశుగ్రాసాన్ని పెంచేందుకు మొదటి ప్రాధాన్యత కింద ఆయా మండలాల్లో ఉపాధి నిధులను వెచ్చించేందుకు అధికారులు ప్రస్తుతం చర్యలు చేపట్టారు. వచ్చే ఏప్రిల్ నాటికి ఉమ్మడి జిల్లాలో 20వేల ఎకరాల్లో పశుగ్రాసాన్ని పెంచే కార్యక్రమాన్ని పూర్తి చేస్తామని కర్నూలు, నంద్యాల జిల్లాల పశుసంవర్థక శాఖ అధికారులు తెలిపారు. రెండు జిల్లాలో 5 లక్షల దాకా పాడి పశువులు ఉన్నట్లు వారు తెలిపారు.

రైతులకు సువర్ణావకాశం



ఉపాధి నిధుల ద్వారా రైతులు, పాడిగేదెల పెంపకందారులు పశుగ్రాసాన్ని పెంచేందుకు నిధులను పెద్ద ఎత్తున ప్రభుత్వం కేటాయించనుంది. మార్గదర్శకాలు వచ్చిన వెంటనే చర్యలు తీసుకుంటాం. **- శ్రీనివాస్, జేడీ, కర్నూలు**

సమస్యలపై చర్చ సాగేనా?

నేడు సర్వసభ్య సమావేశం

- కార్పొరేషన్‌లో అభివృద్ధే అంతంతే..
- బురదమయంగా నగర రోడ్లు
- ప్రజల్లో నెలకొన్న 'ట్రాఫికర్'
- ఊసే లేని రోడ్ల విస్తరణ ● దుర్భర స్థితిలో డ్రైన్లు
- తాగునీటికి తప్పని అవస్థలు
- హాజరుకానున్న మంత్రి టీజీ భరత్, ఎంపీలు బస్తిపాటి, బైరెడ్డి శబరి, ఎమ్మెల్యేలు

కర్నూలు, న్యూసిటీ, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): కర్నూలు నగరపాలక సంస్థలోని సమస్యలపై చర్చ జరిగేనా? అన్న అనుమానాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. నగరపాలక సంస్థ పరిధిలో ప్రతిరోజు ఏదో ఒకసమస్య వస్తూనే ఉంది. నగరాన్ని సుందరవనంగా తీర్చిదిద్దాతామని వైసీపీ ప్రభుత్వంలో ప్రజాప్రతినిధులు, అధికారులు ఆదిశగా అభివృద్ధి చేయలేదని స్థానికులు చర్చించుకుంటున్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఏర్పడి 11 నెలలవుతున్నా అభివృద్ధి పనులు అంతంత మాత్రమే అంటూ కొందరు అభిప్రాయం వ్యక్తంచేస్తున్నారు. వర్షం పడితే శివారుకాలనీల్లో రోడ్లన్నీ బురదమయంగా మారుతున్నాయి. నగరంలో రోజురోజుకు పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు చేపట్టకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్ల విస్తరణ చేపడితే ట్రాఫిక్ అంతరాయం నుంచి విముక్తి కలుగుతుంది. నగరంలో వాహనాలకు పార్కింగ్ సమస్య వేధిస్తోంది. బహుళఅంతస్తు భవనాలు, వ్యాపార సముదాయాల వద్ద పార్కింగ్ లేకపోవడంతో వాహనాలను పార్కింగ్ కరువైంది. నిషేధిత ప్లాస్టిక్‌పై నియంత్రణ కొరవడింది. యథేచ్ఛగా విక్రయాలు, విచ్చలవిడిగా వినియోగం సాగుతోంది. నగర పరిధిలో కోట్లు వెచ్చించి డ్రైనేజీలు, సీసీరోడ్లు, వివిధ అభివృద్ధి పనులు చేపట్టేందుకు ఎన్నికల ముందు అనేకచోట్ల ప్రజాప్రతినిధులు, అధికారులు శంకుస్థాపన చేశారు. అందులో కొన్ని శంకుస్థాపన వరకే పరిమితమయ్యాయి. వీటన్నింటిపై అధికార ప్రతిపక్ష కార్పొరేటర్లు ప్రశ్నిస్తారా లేదా అనే విషయంపై కొందరు గుసగుసలాడుతున్నారు. ప్రధానంగా ప్రతిపక్ష పార్టీకి చెందిన కార్పొరేటర్లు ఎక్కువ సంఖ్యలో ఉన్నారు. గడిచిన వైసీపీ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందని కొందరు వైసీపీ కార్పొరేటర్లే పలు సమావేశాల్లో మేయర్‌పై ప్రశ్నలవర్షం కురిపించారు. ప్రస్తుతం మేయర్‌ను కూడా దించేందుకు ప్రతిపక్ష కార్పొరేటర్లు ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది.

శివారు కాలనీలపై శీతకన్ను..

శివారు కాలనీలపై వైసీపీ హయాంలో ప్రజాప్రతినిధులు, అధికారులు శీతకన్ను వేశారు. కల్లూరు మండలంలోని పందిపాడు, లక్ష్మీపురం రోడ్డు అధ్వా నంగా తయారైంది. ఇతర కాలనీల పరి స్థితి అదేవిధంగా ఉంది. వర్షాకాలంలో చి న్నపాటి వర్షం కురిసినా రోడ్లన్నీ బురదమ యంగా మారుతున్నాయి. సంస్థ పరిధిలో సు మారు 850 కిలోమీటర్ల రోడ్లవిస్తరణ ఉంది. సుమారు 50నుంచి 60రహదారులు గుంతలమయంగా తయార య్యాయి. తాగునీటికోసం ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కొన్నిచోట్ల రెండు,మూడు రోజులకోసారి నీరు వదులుతున్నారు. నగరంలో 52 వార్డుల్లో సుమారు 6లక్షలకుపైగా జనాభా నివసిస్తున్నారు. కర్నూలు, పాణ్యం నియోజకవర్గ పరిధిలోని కల్లూరుని కలుపుకొని మొత్తం 33 ఓవర్‌హెడ్ ట్యాంకులున్నాయి. ప్రతిరోజు 80 ఎంఎల్‌డీ(మిలియన్ లీటర్ పర్‌డే) మేర నీటిని సరఫరా చేస్తున్నారు. ప్రస్తుత జనాబాను దృష్టిలో ఉంచుకుని దాదాపు 120 ఎంఎల్‌డీల నీటి అవసరముంది.



పలు అంశాలపై చర్చ..

నగరపాలకసంస్థ సర్వసభ్యసమావేశం శనివారం ఉదయం 11గంటలకు జరగనుంది. పలు అంశాలపై పాలకవర్గ సభ్యులు చర్చించనున్నారు. సుంకేసుల రోడ్డులోని ఎస్‌బీఐ కాలనీ కౌన్సిల్‌హాల్‌లో జరిగే సమావేశానికి మేయర్ బీవై.రామయ్య అధ్యక్షతన వహించనున్నారు. మంత్రి టీజీ.భరత్‌తో పాటు కర్నూలు, నంద్యాల ఎంపీలు బస్తిపాటి నాగరాజు, బైరెడ్డి శబరి, పాణ్యం, కోడుమూరు ఎమ్మెల్యేలు గౌరుచరితారెడ్డి, దస్తగిరి, కమిషనర్ ఎస్. రవీంద్రబాబు తదితరులు హాజరుకానున్నారు.

తిమ్మగురుడుస్వామికి ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు



ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరిని సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

గూడూరు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక తిమ్మగురుడు స్వామి జాతర సందర్భంగా కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి స్వామివారిని దర్శించు కొని ప్రత్యేక పూజలు చేశారు. శుక్రవారం తిమ్మగురుడు స్వామి ఆలయంలో స్వామివారిని దర్శించుకునేందుకు వచ్చిన ఎమ్మెల్యేను టీడీపీ నాయకులు శాలువాలు కప్పి పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నగరపంచాయతీ మాజీ వైస్‌చైర్మన్ రామాంజనేయులు, టీడీపీ నాయకులు పోలు, రేమట వెంకటేష్, కౌన్సిలర్లు రేమట సురేష్, బుడ్డంగలి, కలాం బాష, ఎల్లయ్య, నాగప్ప యాదవ్, డాక్టర్ మన్సన్‌బాష, ప్రభాకర్ నాయుడు, పి.రామాంజనేయులు, పెద్ద చాంద్ బాష, సుమన్‌బాబు, నాయుడు, కన్నయ్య, అక్కులదేవి గిడ్డయ్య, కురువ హనుమంతు, రవి పాల్గొన్నారు.

మే డే ఉత్సవాలను జయప్రదం చేయాలి

కర్నూలు న్యూసిటీ, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): మేడే ఉత్సవాలను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎండి.అంజిబాబు అన్నారు. శుక్రవారం కేకే భవన్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో నరేంద్రమోదీ అధికారంలోకి వచ్చాక ఎన్నడూ లేనివిధంగా కార్మికులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రతి కార్మికుడు మేడే ఉత్సవాల్లో తప్పక పాల్గొనాలన్నారు.

పండ్ల తోటలతో అధిక లాభాలు

సి. బెళగల్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): పండ్ల తోటల సాగుతో అధిక లాభాలు సాధించొచ్చని కోడుమూరు ఉద్యానవన శాఖాధికారి మధుసూదన్‌గౌడు అన్నారు. శుక్రవారం మండలంలోని బ్రాహ్మణదొడ్డి, మారందొడ్డి గ్రామాల్లోని పండ్లతోటలను ఆయన పరిశీలించి మాట్లాడారు. మామిడి, దానిమ్మ, బొప్పాయి, జామ, కొబ్బరి, మునగ తోటలను పెంచుకోవడానికి సన్నకారు రైతులు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. రైతులు ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎంపీవోలు చెంచురాజు, భాస్కర్, రైతులు తదితరులున్నారు.

నీటి తొట్ల నిర్మాణం వేగవంతం చేయాలి

సి. బెళగల్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): పశువుల నీటి తొట్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని ఎంపీడీవో రాణెమ్మ ఉపాధి సిబ్బందికి ఆదేశించారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయ సమావేశభవనంలో ఉపాధి సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. మండలంలోని 12 గ్రామ పంచాయతీలకు మంజూరైన తొట్లను వెంటనే పూర్తి చేయాలన్నారు. జాబ్‌కార్డు లేనివారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అన్ని పంచాయతీల్లో కూలీలు ఉపాధి పనులను పొందాలన్నారు.

ప్రాజెక్టులకు నిధులు కేటాయించాలి

కర్నూలు న్యూసిటీ, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులకు నిధులు కేటాయించి పూర్తిచేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం సీఆర్ భవన్‌లో జరిగిన నగర సమితి సమావేశంలో ఆయన మాట్లాడారు. వేదవతి, గుండ్రేవుల, గురురాఘవేంద్ర ప్రాజెక్టులకు నిధులు కేటాయించి జిల్లాను ఆదుకోవాలన్నారు. నగరానికి శాశ్వతంగా తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, లేనిపక్షంలో సీపీఐ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. నాయకులు కే.జగన్నాథం, సి.మహేష్, పి.రామక్రిష్ణారెడ్డి, శ్రీనివాస రావు, నాగరాజు, నల్లన్న పాల్గొన్నారు.

రేపు వాల్మీకి ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం

కర్నూలు న్యూసిటీ, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): జిల్లా వాల్మీకి ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం జడ్పీ ఆవరణలోని ఎంపీపీ హాలులో వాల్మీకి ఉద్యోగుల ఆత్మీయ సమేళనం నిర్వహిస్తున్నట్లు సంఘం కార్యనిర్వాహకులు డా.మల్లన్న శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు రంగాలు, వివిధ విభాగాల్లో పనిచేస్తున్న వాల్మీకి ఉద్యోగులందరూ ఈసమ్మేళనానికి హాజరు కావాలని ఆయన పిలుపునిచ్చారు. వాల్మీకి జాతిని జాగృతం చేయడానికి అవసరమైన ప్రణాళికలు రూపొందిస్తారని పేర్కొన్నారు.

పీజీ సెట్, పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ

కర్నూలు అర్బన్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ బాలుర డిగ్రీ కళాశాలలో పీజీ సెట్, పోటీపరీక్షల కోసం విద్యా ర్థులకు ఉచిత శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఇందిరాశాంతి శుక్రవారం ఒకప్రకటనలో తెలిపారు. ఎంతో అనుభవంకలిగిన కళాశాల అధ్యాపకులు ఈతరగతులను బోధిస్తారని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కేరీర్ గైడెన్స్ సెల్‌కమిటీ, కళాశాల ఐక్యూఏసీ కమిటీల ఆధ్వర్యంలో ఐదు రోజుల పాటు ఉదయం నుంచి సాయంత్రం వరకు తరగతులు నిర్వహించబడతాయని పేర్కొన్నారు.

నేడు పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ప్రభుత్వ బాలుర డిగ్రీ కళాశాలలో పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం శనివారం నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఇందిరాశాంతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని క్లస్టర్ యూనివర్సిటీ పరిధిలోగల కళాశాలకు పూర్వవిద్యార్థుల కమిటీ కన్వీనర్ కేజీ మల్లికార్జున ఆధ్వర్యంలో పెద్దసంఖ్యలో హాజరుకావాలని కోరారు.

'వేతనాల్లో కోతలు విధించొద్దు'

కర్నూలు అర్బన్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): నాన్‌టీచింగ్ ఉద్యోగుల వేతనాల్లో నుంచి ప్రతినెల రూ.50 కోత విధిం చొద్దని ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి రమేష్ డిమాండ్ చేశారు. ఈమేరకు జిల్లా అధ్యక్షుడు మీనాక్షిరెడ్డితో కలిసి రాయలసీమ యూనివర్శిటీ రిజిస్ట్రార్ బోయ విజయకుమార్‌నాయుడుకు శుక్రవారం వినతిపత్రం అందించారు.

క్రీడాకారులను ప్రోత్సహిద్దాం

గూడూరు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): కబడ్డీ క్రీడాకారులకు అన్నిరకా లుగా ప్రోత్సహిద్దామని మాజీ జడ్పీటీసీ ఎల్ వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రారం గూడూరులో అయ్యకొండ కబడ్డీ టీంకు చెందిన పొన్నకల్ వాల్మీకి సీతారాం టీంకు కబడ్డీ ప్రత్యేక దుస్తులను అందజేశారు. ఈసందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ క్రీడలను, క్రీడాకారులకు ఎప్పుడూ ప్రోత్సాహాన్ని అందిస్తున్నామన్నారు.

బైక్‌ను ఢీకొట్టిన కారు.. ఇద్దరికి గాయాలు

ఓర్వకల్లు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): కర్నూలు-చిత్తూరు జాతీయ రహదారి-40పై ఓర్వకల్లు గ్రామ సమీపాన గల తిప్పాయపల్లె క్రాస్ రోడ్డువద్ద హైవేపై శుక్రవారం బైక్‌ను వెనుకవైపు నుంచి కారు ఢీకొట్టింది. ఇద్దరికి తీవ్రగాయాలైనట్లు పోలీసులు తెలిపారు. వివరాలు.. కర్నూలు మండలం బస్తిపాడుకి చెందిన దేవమ్మ, ఆమె కుమారుడు వినోద్‌లు బైక్‌పై బేతంచర్లకు వెళ్తుండగా కారు ఢీకొన్నది. తీవ్రగాయాలు కాగా చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వాస్పత్రికి తర లించారు.

రీసర్వేకు రైతులు సహకరించాలి

సి. బెళగల్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): రీసర్వేకు రైతులు సహకరించాలని రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మండల కేంద్రంలో నిర్వహిస్తున్న రీసర్వేకు రైతులు తమపట్టాదారు పాసుబుక్‌లు, ఆధార్‌కార్డు ఫోన్‌నంబర్‌కు లింక్ అయి ఉండాలన్నారు.

షూటింగ్ బాల్ పోటీల్లో రాణించాలి

కర్నూలు స్పోర్ట్స్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా మదనపల్లి పట్టణంలో ఈ నెల 26 నుంచి 27 వరకు జరగబోయే 8వ రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్ షూటింగ్ బాల్ పోటీల్లో పాల్గొనే కర్నూలు జిల్లా జట్టు క్రీడాకారులకు రైల్వేస్టేషన్‌లో వైసీపీ రాష్ట్ర మహిళ ప్రధాన కార్యదర్శి కల్లా నాగవేణి రెడ్డి క్రీడాకారులకు క్రీడాదుస్తులు పంపిణీ చేసి వీడ్కోలు పలికారు. షూటింగ్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పరుశురాముడు, కోచ్ స్వాతి, డా.శ్రీనివాస్ ఉన్నారు.

ఆన్‌లైన్ తరగతులను వినియోగించుకోండి

- నైపుణ్యం పొందేందుకు అవకాశం
- రాష్ట్రంలో మొదటిసారి వర్చువల్ తరగతులు
- కలెక్టర్ రంజిత్ బాషా



మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్ బాషా

కర్నూలు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఉచిత ఆన్‌లైన్ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ రంజిత్‌బాషా అన్నారు. శుక్రవారం యువజన సంక్షేమ శాఖ సెట్కూరు, జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో ఏర్పాటుచేసిన వర్చువల్ స్టూడియోలో నిర్వహిస్తున్న ఆన్‌లైన్ మాస్టర్‌క్లాస్ శిక్షణా తరగతులను కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఈనెల 25నుంచి మే 28 వరకు 8నుంచి 12వ తరగతి విద్యార్థులకు ఆన్‌లైన్ శిక్షణ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నైపుణ్య ఐఏఎస్ కోచింగ్ అకాడమీ వారి సహకారంతో 8వ తరగతి నుంచి 12వ తరగతి విద్యార్థుల కోసం కేరీర్ గైడెన్స్, నైపుణ్యాబివృద్ధి శిక్షణా తరగతులను వర్చువల్ విధానంద్వారా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు పైతరగతుల్లో ఏ సబ్జెక్టు ఎంచుకోవాలి.. తమకు ఏదీ అనుగుణంగా ఉంటుందని విశ్లేషించుకోవడంతో పాటు జనరల్‌నాలెడ్జ్ వివిధఅంశాల్లో నైపుణ్యం పొందేందుకు ఈతరగతులు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. విద్యార్థులందరూ ఈతరగతులను వినియోగించుకోవాలన్నారు. రాష్ట్రంలో మొట్టమొదటి సారిగా జిల్లాలో విద్యార్థులకోసం వర్చువల్ తరగతులు ప్రారంభించామని కలెక్టర్ గుర్తుచేశారు. వర్చువల్ తరగతుల నిర్వహణ ద్వారా జిల్లాలో హిందీ ఉపాధ్యాయుల కొరత ఉన్నప్పటికీ పదో తరగతిలో హిందీ సబ్జెక్టులో 99శాతం పాసయ్యారని తెలిపారు. పదోతరగతి ఫెయిలైన విద్యార్థులు వర్చువల్ ద్వారా రెమిడియల్ తరగతులు, విషయ నిపుణులచే ఆన్‌లైన్‌లో బోధన నిర్వహిస్తున్నామని తెలిపారు. డీఈవో శామ్యూల్‌పాల్ మాట్లాడుతూ ఉచిత ఆన్‌లైన్ శిక్షణకు సంబంధించి లింక్ వివరాలు, క్లాస్ ఫీచర్ ద్వారా విద్యార్థులకు షేర్ చేయడం జరుగుతుందన్నారు. సెట్కూరు సీఈవో డా.వేణుగోపాల్, నైపుణ్య ఐఏఎస్ అకాడమి చైర్మన్ క్రిష్ణ పాల్గొన్నారు.

దేశాన్ని కాపాడుకుందాం

- అశోకా మహిళా ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ అశోకవర్ధన్‌రెడ్డి
- పాకిస్థాన్‌ను ఉగ్రవాద దేశంగా ప్రకటించాలి
- వీహెచ్‌పీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకట్రామయ్య
- ఉగ్రవాదుల దిష్టిబొమ్మ దహనం



కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న అశోకా మహిళా ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థినులు

కర్నూలు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఈ దేశం మనందరిది.. దీన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని అశోకా మహిళా ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ అశోకవర్దన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం సాయంత్రం కళాశాల ఆవరణలో కశ్మీర్ ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన వారిఆత్మలకు శాంతిచేకూరాలని కోరుతూ విద్యార్థినులు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఉగ్రవాదాన్ని ఖండిద్దాం.. శాంతికి మద్దతు ఇస్తాం.. అనే నినాదాలతో ర్యాలీ ముందుకు సాగింది. ఈసందర్భంగా అశోకవర్దన్‌రెడ్డి మాట్లాడుతూ ఇలాంటి క్రూరమైన చర్యలు మానవీయ విలువలపై దాడి చేస్తున్నాయన్నారు. కళాశాల సీఈవో డా.హరిష్ కృష్ణ, ప్రిన్సిపాల్ డా.ఆర్.నవీన్, అధ్యాపకులు పాల్గొన్నారు.

అమాయక ప్రజలపై..

కర్నూలు న్యూసిటీ: అమాయక ప్రజలపై దాడులకు పాల్పడే ఉగ్రవాదులను ఏరిపారేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎండీ అంజిబాబు అన్నారు. శుక్రవారం సీపీఎం పాతబస్తీ నగరకార్యదర్శి ఎస్ఎండీ.షరీఫ్ అధ్వర్యంలో పొట్టిశ్రీరాములు విగ్ర హం ముందు ఉగ్రదాడిని ఖండిస్తూ నిరసన చేపట్టారు. సభ్యులు కే.రామక్రిష్ణ, నగర కార్యదర్శి రాజశేఖర్ నాగస్వా ములు, ఈశ్వర్ పాల్గొన్నారు.



ఉగ్రవాదం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న వీహెచ్‌పీ, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు

రాజ్‌విహార్ కూడలిలో..

కర్నూలు రాజ్‌విహార్: కశ్మీర్ పర్యాటకులపై ఉగ్రవాదులు జరిపిన దాడి పిరికిపింద చర్యని జనసేన నాయకులు తెలిపారు. స్థానిక రాజ్‌విహార్ కూడలిలో ఉగ్రవాదుల చర్యలను నిరసిస్తూ మానవహారంగా ఏర్పడ్డారు. నాయకులు తోళ్ల మంజునాథ్, రేఖాగౌడు, పవన్‌కుమార్, సంధ్య విక్రమ్‌కుమార్, బజారి, షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న..

కర్నూలు కల్చరల్: ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న పాకిస్థాన్‌ను ఉగ్రవాద దేశంగా ప్రకటించాలని విశ్వ హిందూ పరిషత్ (వీహెచ్‌పీ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోమిశెట్టి వెంకట్రామయ్య డిమాండ్ చేశారు. నగరంలోని శ్రీకృష్ణదేవరాయల విగ్రహం కూడలి (ధర్నాచౌక్) వద్ద ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ప్రాణాలు కోల్పోయిన హిందువుల ఫ్లెక్సీ చిత్రపటాలకు పూలతో శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా సోమిశెట్టి వెంకట్రామయ్య మాట్లాడుతూ పాకిస్తాన్‌ను ఉగ్రవాద దేశంగా ప్రకటించడంతోపాటూ ఆంక్షలు విధించాలన్నారు. వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు టీసీ మద్దిలేటి, విశేష్ సంపర్క్ కన్వీనర్ టి. ప్రతాపరెడ్డి, మీడియా రాష్ట్ర కన్వీనర్ మాళిగి భానుప్రకాశ్ మాట్లాడుతూ హిందువుల్లో అనైక్యత వల్ల రాబోయే రోజుల్లో మరిన్ని విపత్కర పరిణామాల్ని ఎదుర్కొవాల్సి వస్తుందన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నగరూరు రాఘవేంద్ర, లలితాపీఠం పీఠాధిపతి మేడా సుబ్రహ్మణ్యం స్వామి, వీహెచ్‌పీ రాష్ట్ర నాయకులు ఎస్ ప్రాణేశ్, మహేష్, అనంత విశ్వప్రసాద్, గోరంట్ల రమణ, జిల్లా నాయకులు ఈపూరి నాగరాజు, నీలి నరసింహ, గోవిందరాజులు, గిరిబాబు, నవీన్‌కుమార్, శివకోటిలతోపాటూ వీహెచ్‌పీ, బజరంగ్ దళ్ అనుబంధ సంస్థల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు ముహూర్తం ఖరారు

ఓర్వకల్లు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు మే 10 నుంచి 13వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. శుక్రవారం ఓర్వకల్లులోని చెన్నకేశవస్వామి ఆలయంలో పురోహితులు విష్ణుశర్మ, అర్చకులు నారాయణరావు బ్రహ్మోత్సవాల లగ్నపత్రిక రాసి పూజలు నిర్వహించారు. ఈ ఉత్సవాలు మే 10న శనివారం వైశాఖ శుద్ధ త్రయోదశిలో ఉదయం పూజలతో ప్రారంభం అవుతాయన్నారు.

'మత విద్వేషాలు రెచ్చగొట్టడం తగదు'

కర్నూలు కల్చరల్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): కశ్మీర్‌లోని పహల్గాం దాడులను నిరసిస్తూ శుక్రవారం ప్రజాస్వామ్య సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో, నగరంలోని పీవోడబ్ల్యూ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. వేదిక కో కన్వీనర్ అల్లాబకాష్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో వేదిక నాయకులు ప్లకార్డులు ప్రదర్శించారు. సుంకన్న, భాస్కరరెడ్డి, జమియుల్లా, సుబ్బారాయుడు, రత్నం ఏసేపు పాల్గొని ప్రసంగించారు.

మాట నిలబెట్టుకున్న సీఎం

కర్నూలు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): నాయీ బ్రాహ్మణుల అభివృద్ధి రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతోనే సాధ్యం అని మరోసారి రుజువైందని నాయీ బ్రాహ్మణ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పాలవీటి విజయకుమార్ తెలిపారు. శుక్రవారం సీఎం చంద్రబాబు, దేవాదయ శాఖ మంత్రి ఆనం నారాయణ రెడ్డికి నాయీ బ్రాహ్మణుల తరుపున ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతు కృతజ్ఞతగా స్థానిక బీ.క్యాంపు సమీపంలోని బీసీ భవన్‌లో సీఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.

అభివృద్ధి పనులకు భూమి పూజ

గూడూరు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్ ఖానాపురం గ్రామంలో అభివృద్ధి పనులకు భూమి పూజ నిర్వహించారు. శుక్రవారం ఆర్ ఖానాపురం గ్రామంలో సర్పంచ్ మునిస్వామి ఆధ్వర్యంలో మురికి కాలు వ నిర్మాణానికి భూమి పూజ చేశారు.

పోరాడితేనే సమస్యలు పరిష్కారం

కర్నూలు అగ్రికల్చర్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): గిరిజనులంతా ఏకతాటిపై నిలబడి తమ సమస్యల పరిష్కారం కోసం పాలకులపై పోరాడితేనే పరిష్కారం అవుతాయనీ, ఇందుకు గిరిజన ఉద్యోగులంతా సంఘాలుగా ఏర్పడాలని ఆలిండియా గిరిజన ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సత్యనారాయణ అన్నారు. శుక్రవారం నగరంలోని అంబేద్కర్ భవన్‌లో ఆలిండియా గిరిజన ఉద్యోగుల ముఖ్య నాయకుల సమావేశాన్ని సంఘం జిల్లా అధ్యక్షుడు మద్దిలేటి అధ్యక్షతన జరిగింది.

మాజీ సైనికుల నివాళి

కర్నూలు స్పోర్ట్స్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఉగ్రవాదుల దాడుల్లో మృతి చెందిన అమరులకు శాంతి కలగాలని మాజీ సైనికుల సంఘం కొవ్వొతులతో నివాళులర్పించారు. శుక్రవారం రాత్రి కలెక్టరేట్ కార్యాలయం గాంధీ విగ్రహం ముందు కొవ్వొతులతో నివాళులర్పించారు.

నూనె గింజల ఉత్పత్తిని పెంచండి

- జాయింట్ కలెక్టర్ నవ్య

కర్నూలు అగ్రికల్చర్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): నూనెగింజల ఉత్పత్తిని గణనీయంగా పెంచాలని, రైతులకు లాభాలబాట పట్టించాలని నేషనల్ మిషన్ ఆఫ్ ఎడిబుల్ ఆయిల్స్ (ఆయిల్స్ సీడ్స్) కన్వర్షేషన్స్ సమావేశంలో జాయింట్ కలెక్టర్ డా.బి.నవ్య అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జేసీ తన చాంబరులో నేషనల్ మిషన్ ఆఫ్ ఎడిబిల్ ఆయిల్స్ కన్వర్షేషన్స్ సమావేశాన్ని నిర్వహించారు. కేంద్రం వ్యవసాయ శాఖ, రైతుల సంక్షేమ విభాగం ద్వారా క్రిషోన్నతి పథకం కింద ఆయిల్ సీడ్స్ సంస్థను కొత్తగా ఏర్పాటుచేసి దీని ద్వారా జిల్లాలో ఐదేళ్లలోనూనెగింజల ఉత్పత్తిని గణనీయంగా పెంచడానికి తీసుకోవల్సిన చర్యలు, మార్గదర్శకాలను విడుదల చేసిందన్నారు. సాగులో లేని భూములను గుర్తించి ఆ భూములను సాగులోకి తీసుకొచ్చి అందులో నూనెగింజల సాగు చేయించాలన్నారు. 200 మంది రైతుల భూములను ఒక క్లస్టర్‌గా ఏర్పాటుచేసి వారిని ప్రోత్సహించి నూనెగింజల సాగుపై అవగాహన కల్పించాలని సూచించారు.

మార్కుల పర్సంటేజీలను తొలగించాలి

● నిరుద్యోగ పీఈటీల డిమాండ్ ● కలెక్టరేట్ ఎదుట నిరసన



డీఈవో శామ్యూల్‌పాల్‌కి వినతిపత్రం ఇస్తున్న నిరుద్యోగ వ్యాయామ ఉపాధ్యాయులు

కర్నూలు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన డీఎస్సీ నోటిఫికేషన్‌లో మార్కుల పర్సంటేజీని వెంటనే తొలగించి అర్హులైన ప్రతి ఒక్కరికీ అవకాశం కల్పించాలని ఆంధ్రప్రదేశ్ నిరుద్యోగ ప్రైవేటు వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం రాష్ట్రకార్యదర్శి అవినాశ్‌శెట్టి, జిల్లా అధ్యక్షుడు చిన్న సుంకన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఆంధ్రప్రదేశ్ ప్రైవేటు వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలో ఖాళీగా ఉన్న వ్యాయామ ఉపాధ్యాయ పోస్టులను సైతం యూజీడీపీడీ చేసిన వారికి పీఈటీలుగా అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. 2025 డీఎస్సీ నోటిఫికేషన్‌లో ప్రతి మోడల్ స్కూల్, కేజీబీవీలకు పీఈటీలను డీఎస్సీ ద్వారా నిర్వహించాలని కోరారు. ప్రొఫెషనల్ కోర్సులో పర్సంటేజీ శాతాన్ని తీసుకుని డీఎస్సీలో అవకాశం కల్పించాలని కోరారు. ప్రభుత్వం స్పందించకపోతే రానున్నరోజుల్లో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. డీఆర్వో వెంకటనారాయణమ్మను, డీఈవో శామ్యూల్‌పాల్‌ను కలిసి వినతిపత్రాలు సమర్పించారు. నిరుద్యోగ పీఈటీ వినోద్, నరసింహ, నాగన్న పాల్గొన్నారు.

విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి

జిల్లావ్యాప్తంగా ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల్లో విద్యాసంవత్సరం ప్రారంభం కాకముందే ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా అక్రమ అడ్మిషన్లు చేపడుతున్న విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని రిపబ్లిక్ స్టూడెంట్ ఫెడరేషన్ జిల్లాకార్యదర్శి మహేష్ డిమాండ్ చేశారు. డీఈవో కార్యాలయంలో డీఈవో శామ్యూల్‌పాల్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. మహేష్ మాట్లాడుతూ జిల్లాలో ప్రైవేటు విద్యాసంస్థలు తమ ఇష్టమొచ్చినట్లు ఫ్లెక్సీలు, కరపత్రాలు పంపిణీచేస్తూ, తల్లిదండ్రులను ప్రలోబాలకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ప్రైవేటు విద్యాసంస్థలను నియంత్రించకపోతే ఆవిద్యాసంస్థలపై దాడిచేస్తామని హెచ్చరించారు. మధు, అక్తర్ పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించం

● డీఎస్పీ బాబుప్రసాద్ ● ముజఫర్‌నగర్‌లో కార్డెన్ సెర్చ్

కర్నూలు క్రైం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని డీఎస్పీ బాబుప్రసాద్ అన్నారు. శుక్రవారం నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిదిలోని ముజఫర్‌నగర్‌లో పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. డీఎస్పీ బాబుప్రసాద్ ఆధ్వర్యంలో సీఐలు, ఎస్‌ఐలు, స్పెషల్ పార్టీ, ఆర్మడు పోలీసు బృందాలు తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా పాత నేరస్థులు, రౌడీషీటర్లు, అనుమానితులు, ట్రబుల్ మాంగర్స్, సమస్యాత్మక వ్యక్తుల ఇళ్లను వారి ఇళ్లలో తనిఖీలు నిర్వహించారు. డ్రోన్ కెమెరాతో గట్టి నిఘా ఉంచారు. అలాగే ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించారు. వాహనపత్రాలు సరిగ్గాలేని 19 బైకులు, 3 ఆటోలను స్వాధీనం చేసుకున్నారు. సీఐలు మధుసూదన్‌గౌడు, మన్సూరుద్దీన్, శ్రీధర్, నాగశేఖర్, ఎస్‌ఐలు, 15 మంది స్పెషల్ పార్టీ బృందాలు, డ్రోన్ కెమెరా, 100 మంది పోలీసులు, హోంగార్డులు ఉన్నారు.

ముగిసిన విగ్రహ ప్రతిష్ఠ

ఓర్వకల్లు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సోమయాజులపల్లె గ్రామ సమీపాన ఉన్న సుంకులా పరమేశ్వరి దేవి ఆలయంలో బొడ్రాయి, అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ శుక్రవారం ముగిశాయి. ఈకార్యక్రమానికి పొదుపులక్ష్మి మండల ఐక్య సంఘం గౌరవ సలహాదారులు విజయభారతి హాజరై అమ్మవారికి కాయకర్పూరాలు సమర్పించి మొక్కుబడులు తీర్చుకున్నారు. అనంతరం ఆమెకు మహిళలు ఘనంగా సన్మానించారు.

హోరాహోరీగా కబడ్డీ పోటీలు..

విగ్రహప్రతిష్ఠను పురస్కరించుకొని నిర్వహించిన కబడ్డీ పోటీలు హోరాహోరీగా సాగాయి. ఈపోటీలను తిలకించేందుకు యువత అధికసంఖ్యలో తరలివచ్చారు. విజేతగా శకునాల జట్టు నిలిచి రూ.20వేల నగదును కైవసం చేసుకుంది. రెండో, మూడో విజేతలుగా కొంతలపాడు, వడ్డెమాను టీంలు నిలిచి రూ.15వేలు, రూ.10వేల నగదును గెలుపొందాయి. నాలుగో, ఐదు, ఆరో విజేతలుగా ఓంకారం, ఎంబాయి, అర్‌ఎస్ రంగాపురం టీంలు నిలిచి రూ.5వేలు, రూ.3వేలు, రూ.2వేలను గెలుచుకున్నాయి. చంద్రశేఖర్, ఆకుల మహేష్, కాకి దేవేంద్ర, శ్రీనివాసులు, నాగమల్లేష్, బొగ్గుల మహి, బ్రహ్మయ్య తదితరులున్నారు.



కబడ్డీ విజేతలకు బహుమతులు పంపిణీ చేస్తున్న దాతలు

సమష్టి కృషితో మలేరియాను అంతం చేద్దాం

కోడుమూరు రూరల్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): సమష్టి కృషితో మలేరియాను అంతం చేద్దామని లద్దగిరి పీహెచ్‌సీ వైద్యాధికారి భాస్కర్ అన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. రక్తపరీక్ష ద్వారా మలేరియాను గుర్తించి చికిత్స పొందాలని సూచించారు.

వైద్యపరీక్షలు తప్పనిసరి

గర్భిణులు క్రమం తప్పకుండా వైద్యపరీక్షలు చేయించుకోవాలనిలద్దగిరి పీహెచ్‌సీ హెల్త్‌ఎడ్యుకేటర్ శ్రీనివాసయాదవ్ తెలిపారు. శుక్రవారం ఆస్పత్రిలో గర్భిణులకు పలు సూచనలు అందించారు.

మలేరియాను నిర్మూలిద్దాం

కోడుమూరు : ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకొని మలేరియాను నిర్మూలిద్దామని ఆరోగ్య విస్తరణ అధికారి నరసప్ప అన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా శుక్రవారం స్థానిక పంచాయతీ కార్యాయలం నుంచి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ కమాల్‌సాహెబ్, ఉమాబాయి, ఆరోగ్య, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

అన్నదానానికి ముందుకు రండి

మద్దికెర, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రంగనాథ స్వామి ఆలయంలో భక్తులకు ప్రతి శనివారం మధ్యాహ్నం అన్నదానం చేసేందుకు దాతలు ముందుకు రావాలని ఈవో వీరయ్య కోరారు. శుక్రవారం మాట్లాడుతూ ఆసక్తిగలవారు 7569799469, 9640620183 నెంబర్లను సంప్రదించాలన్నారు.

జిల్లా అధికారుల దృష్టికి సమస్యలు



అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

మద్దికెర, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సమస్యలను జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని తుగ్గలి ఎంపీడీవో విశ్వమోహన్, డిప్యూటీ ఎంపీడీవో శ్రీహరి అన్నారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు శుక్రవారం అంగన్‌వాడీ చెత్త నుంచి కేంద్రాలను పరిశీలించారు. చెత్త సంపద కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలని, అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక వసతులు ఉండేలా చూడాలన్నారు. ఇన్‌చార్జి కార్యదర్శి విజయకుమార్ తదితరులు ఉన్నారు.

ఉగ్రవాదాన్ని తుదముట్టించాలి..



జామియా మసీదులో మాట్లాడుతున్న ముస్లింలు

వెల్దుర్తి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): కశ్మీర్ ఉగ్రవాదుల దాడిలో మృతుల బాధిత కుటుంబాలకు మనోధైర్యం ఇవ్వాలని ముస్లింలు ఆకాంక్షించారు. శుక్రవారం జామియా మసీదులో శుక్రవారం మతగురువు తాజుద్దీన్ ఖాద్రీ ఆధ్వర్యంలో మాజ్ చేశారు. భారతదేశంలో హిందూ, ముస్లింలు అన్నదమ్ముల్లా కలిసి మెలిసి జీవిస్తున్నారన్నారు. మతం పేరుతో అమాయక ప్రజలను చంపిన ఉగ్రవాదులను శిక్షించాలని, ఉగ్రవాదాన్ని కూకటి వేళ్లతో సహ తుదముట్టించాలని కోరారు.

గుండ్లకొండ వద్ద స్లూయిజ్ ఏర్పాటు చేయాలి



గుమ్మిడిరాళ్లలో సంతకాలు సేకరిస్తున్న నాయకులు

దేవనకొండ, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుండ్లకొండ వద్ద హంద్రీనీవా ప్రధాన కాలువకు స్లూయిజ్ ఏర్పాటు చేయాలని రైతుసంఘం ఆధ్వర్యంలో గుడిమిరాళ్ల గ్రామంలో సంతకాలు సేకరించారు. రైతుసంఘం కార్యదర్శి సూరి మాట్లాడుతూ గుండ్లకొండ వద్ద స్లూయిజ్ ఏర్పాటుతో గుడిమిరాళ్ల, బంటుపల్లి, చెలెలచెలిమల, బేతపల్లి, పి.కోటకొండ వరకు సాగునీరు అందుతుందన్నారు. పది చెరువులను నీటితే నింపుకునే అవకాశం ఉందన్నారు. కృష్ణ, కౌలుట్ల, రామాంజినేయులు, ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

రేపు వాల్మీకి ఉద్యోగుల సమ్మేళనం



మాట్లాడుతున్న సుధాకర్ బాబు

ఆదోని అగ్రికల్చర్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 27న కర్నూలు జిల్లా పరిషత్ ఆవరణలో నిర్వహించనున్న వాల్మీకి ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనానికి తరలిరావాలని ఆ సంఘం జిల్లా నాయకుడు సుధాకర్ బాబు, నరసయ్య కోరారు. శుక్రవారం మాట్లాడుతూ విద్యార్థుల సర్వతో ముఖాభివృద్ధి, నిరక్ష్యరాస్యత నిర్మూలనకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. లక్ష్మీకాంత్, రమేష్ నాయుడు, భీమరాజు, సత్తన్న, భాస్కర్ పాల్గొన్నారు.

కలసి పని చేద్దాం



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న వీరభద్ర గౌడ్

ఆలూరు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): టీడీపీలో వర్గాలకు తావులేకుండా కలసి పని చేద్దామని ఆలూరు టీడీపీ ఇన్‌చార్జి వీరభద్ర గౌడ్, మార్కెట్ యార్డ్ చైర్మన్ మాజీ గుమ్మనూరు నారాయణ కోరారు. శుక్రవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వినతుల పరిష్కారానికి సంబంధిత అధికారులకు పంపుతామని తెలిపారు. టీడీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా చూడాలన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేశారన్నారు. పాఠశాలలు తెరిచాకి సీఎం చంద్రబాబు తల్లికి వందనం కూడా అమలు చేస్తారన్నారు.

రీ సర్వేతో సమస్యలు పరిష్కరిస్తాం

మద్దికెర, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): గ్రామంలోని ఉత్తరం గ్రూపులో రీ సర్వే ద్వారా రైతుల సమస్యలు పరిష్కరిస్తామని తహసీల్దార్ హుశేన్‌సాహెబ్ తెలిపారు. శుక్రవారం సచివాలయంలో రైతులతో సమావేశాన్ని నిర్వహించారు. రైతులకు ముందుగా సమాచారం ఇస్తామని, వారి సమక్షంలోనే రీసర్వే జరుగుతుందని తెలిపారు. డీటీ యువరాజు, వీఆర్వో హర్ష, తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న తహసీల్దార్ హుసేన్ సాహెబ్

వృథా



చిప్పగిరలో రూ.25లక్షలు ఖర్చుచేసి నిర్మించిన సచివాలయాన్ని అధికారులు ముళ్లకంపపాలు చేశారు. గత వైసీపీ హయాంలో మంత్రి గుమ్మనూరు జయరాం చిప్పగిరి గ్రామ సచివాలయాన్ని ప్రారంభించారు. అయితే అనంతరం అధికారులు పట్టించుకోకపోవడంతో ముళ్లకంపతో నిండిపోయి, విషపురుగులకు ఆవాసంగా మారింది. అధికారులు ఉపయోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు. - చిప్పగిరి

ఆపద

పట్టణంలోని ఆలూరు-బళ్లారి ప్రధాన రహదారి వద్ద అంబేడ్కర్ కూడలిలో విద్యుత్ బాక్స్‌కు మూత లేకపోవడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఇటీవలె ఓ ఆవు మృత్యువాత పడింది. వర్షం కురిస్తే ఇంకా ప్రమాదమని అధికారులు స్పందించాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయమై ఈవో ప్రభాకర్ రావ్ మాట్లాడుతూ మరమతులు చేయాలని విద్యుత్ అధికారులకు సూచించామని, పునరావృతం కాకుండా చూస్తామన్నారు. - ఆలూరు



ప్రభుత్వ ఆదాయానికి గండి కొడితే సహించం

- కుడా చైర్మన్ సోమిశెట్టి
- ఆదోనిలో అక్రమ వెంచర్ల గోడలు కూల్చివేత



అక్రమ లే అవుట్లను ఎస్కవేటర్‌తో కూల్చివేయిస్తున్న సోమిశెట్టి

ఆదోని రూరల్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): అనుమతి లేకుండా వెంచర్లు వేసి ప్రభుత్వ ఆదాయానికి గండికొడితే సహించమని కుడా చైర్మన్ సోమిశెట్టి హెచ్చరించారు. శుక్రవారం కుడా డీఈ గోపాల్ కృష్ణమూర్తి, ప్లానింగ్ అధికారి మోహన్, ఏసీపీ హయ్యత్, ఆదోని డీఎల్‌పీవో నూర్జాహాన్, పంచాయతీ కార్యదర్శులు చంద్రశేఖర్, సురేష్, విద్యుత్ అధికారులతో కలిసి మండలంలోని బైచిగేరి, నాగలాపురం, సాదాపురం, మండిగిరి, పెద్దహరివాణం, పెద్దతుంబళం గ్రామాల్లో అక్రమ లే అవుట్లలో వేసి రాళ్లు, తారు రోడ్లను ఎక్స్‌కవేటర్ సాయంతో తొలగించారు. సోమిశెట్టి మాట్లాడుతూ మండలంలో 27, ఉమ్మడి జిల్లాల్లో 300పైగా అక్రమ లే అవుట్లను గుర్తించామని, తక్షణమే వీరంతా కుడా నుంచి అనుమతులు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. లేనిపక్షంలో వెంచర్లలో నిర్మించిన ఇళ్లను కూల్చివేస్తామని హెచ్చరించారు. ప్రజలు కొనుగోలు చేసేముందుకు ప్రజలు గమనించాలని, నాన్ లేఅవుట్లలో రోడ్లు, వీధిలైట్లు, డ్రైనేజీలు నిర్మంచబోమన్నారు. రియల్టర్లు పంచాయతీ అధికారులను బెదిరిస్తున్నారని, ఇది మంచి పద్దతి కాదన్నారు. మంత్రాలయంలో అక్రమ లే అవుట్లలో 95 లాడ్జిలు నిర్మించారని నోటీసులు ఇవ్వగా 25మంది అనుమతి తీసుకున్నారన్నారు.

గడువులోగా రీసర్వేలు పూర్తి చేయాలి

- రీసర్వే వర్క్‌షాప్‌లో ఆర్డీవో భరత్‌నాయక్



మాట్లాడుతున్న ఆర్డీవో భరత్‌నాయక్

పత్తికొండ, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం సూచించిన నిర్ణీతసమయంలోగా రీ సర్వే పూర్తిచేయాలని ఆర్డీవో భరత్‌నాయక్ అధికారులు, సిబ్బందికి సూచించారు. శుకరవారం పత్తికొండలోని రమ్యారిసార్ట్‌లో డివిజన్ అధికారులు, సిబ్బందికి వర్క్‌షాప్ నిర్వహించారు. సర్వేయర్లు పారదర్శకత పాటించాలని, రాజకీయ, అధికార వత్తిళ్లకు లొంగవద్దని, తప్పులు జరిగితే సర్వేయర్లతే బ్యాత అని హెచ్చరించారు. 9మండలాల తహసీల్దార్లు, డీటీలు, ఆర్ఐలు, వీఆర్‌వోలు, సర్వేయర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

మలేరియా అంతం మనతోనే..

- డిప్యూటీ డీఎంహెచ్‌వో రఘురామిరెడ్డి



ప్రమాణం చేస్తున్న సిబ్బంది

పత్తికొండ, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మలేరియా అంతం మనతోనే నినాదంతో అవగాహన కల్పించాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో రఘురామిరెడ్డి, వైద్యాధికారి సుజాత సూచించారు. ప్రపంచ మలేరియా దినం సందర్భంగా సబ్ యూనిట్ అధికారి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో శుక్రవారం పత్తికొండలో ర్యాలీ నిర్వహించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటేనే దోమల నివారణ సాధ్యమని, తద్వారా మలేరియా అంతం అవుతుందన్నారు. ఆరోగ్యపర్యవేక్షకులు రవికుమార్, ప్రకాష్, వరలక్ష్మి, ఉమామహేశ్వరి, ఆరోగ్యకార్యకర్తలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతులకు అభినందనలు



క్రీడాకారులను అభినందిస్తున్న ఎంఈవో

ఆదోని అగ్రికల్చర్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): క్రీడల్లో ప్రతిభ చూపిన విభిన్న ప్రతిభావం తులను ఎంఈవోలు రాజేందర్ ప్రసాద్, శ్రీనివాసులు అభినం దించారు. ఈ నెల 21నుంచి విజయవాడలో జరిగిన క్రీడా పోటీల్లో ఆదోని భావిత కేంద్రం విద్యార్థులు ప్రతిభ చాటార న్నారు. అబూబాకర్ సిద్ధికి సైక్లింగ్‌లో రెండో స్థానం, మనోజ్ 100 మీటర్ల పరుగు పందెం మూడో స్థానం, యశ్వంత్ 50 మీ. పరుగులో తృతీయ స్థానంలో నిలిచారన్నారు. శాంతకుమార్, మౌనిక, సంయుక్త పాల్గొన్నారు.

కల్లు స్వాధీనం

- పోలీసుల అదుపులో ఓ పార్టీ నాయకుడు?

ఆదోని రూరల్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గణేకల్లుకు చెందిన ఓ పార్టీ నాయకుడు బోయ కోదండను పెద్దతుంబళం పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. అనుమతి లేకుండా ఇంట్లో కల్లు విక్రయిస్తున్నారని గ్రామస్థులు ఫిర్యాదు చేయడంతో గురువారం రాత్రి 10గంటల సమయంలో పెద్దతుంబళం పోలీసులు సదరు నాయకుడి ఇంట్లో దాడులు నిర్వహించి 8 బాక్సుల కల్లు సీసాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ విషయపై పెద్దతుంబళం ఎస్ఐ మహేష్ కుమార్‌ను వివరణ కోరగా విచారణ చేస్తున్నామని తెలిపారు.

రూ.500 కూలి ఇవ్వాలి

మద్దికెర, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఉపాధి కూలీలకు రూ.500లు కూలి వచ్చేలా చూడాలని సీపీఐ కార్యదర్శి నాగరాజు, వ్యవసాయ సంఘం అధ్యక్షుడు కోదండరాముడు కోరారు. శుక్రవారం ఉపాధి పనులను పరిశీలించి కూలీలతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. కూలీలకు పనిముట్లు ఇవ్వాలని, పని ప్రదేశంలోటెంట్లు, తాగునీరు, ప్రథమ చికిత్స కిట్లు పంపిణీ చేయాలని కోరారు.

ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం ఉచిత సీట్లు

మద్దికెర, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం సీట్లు ఉచితంగా కేటాయించాలని ఎంఈవో రంగస్వామి సూచించారు. శుక్రవారం మాట్లాడుతూ 2025-26 విద్యావ సంవత్సరానికి ఈ నెల 28 నుంచి మే 15వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. తల్లిదండ్రుల ఆధార్, రేషన్‌కార్డు, ఓటర్ కార్డులు, విద్యుత్ బిల్లులతో పాటు పిల్లల వయసు ధృవీకరణ పత్రం సమర్పించాల్సి ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు స్థానిక ఎంఈవో కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

మే 2న రథోత్సవం

పత్తికొండ టౌన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో వెలసిన లక్ష్మి వెంకటేశ్వరస్వామి రథోత్సవం మే 2న నిర్వహిస్తున్నట్లు నిర్వహకులు అమరావతి శివరామకృష్ణయ్య తెలిపారు. ఈ నెల 30 నుంచి మే 2 వరకు ఆలయంలో పూజలు ఉంటాయదన్నారు. మే 2న ఉదయం 10 గంటలకు కల్యాణం, సాయంత్రం 5 గంటలక రథోత్సవం ఉంటుందని తెలిపారు.

మహా సభలను జయప్రదం చేయండి



పోస్టర్లను విడుదల చేస్తున్న నాయకులు

ఆస్పరి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 15నుంచి తిరుపతిలో నిర్వహించనున్న ఏఐవైఎఫ్ 17వ జాతీయ మహాసభలు జయప్రదం చేయాలని జిల్లా అధ్యక్షులు శ్రీరాముడు, జిల్లా ఉపాధ్యక్షుడు రమేష్ పిలుపునిచ్చారు. ఆస్పరిలో పోస్టర్లు విడుదల చేశారు. 2014 ఎన్నికల సమయంలో మోదీ ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి మోసం చేశారన్నారు. హనుమంతు, లక్ష్మన్న, శేఖర్, రామాంజిని పాల్గొన్నారు.

బెల్టు షాపులను అరికట్టండి



వినతిప్రతం ఇస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఆదోని టౌన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో బహిరంగంగా మద్యం విక్రయాలను ఆపాలని, బెల్టు షాపులను అరికట్టాలని కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి రమేష్ యాదవ్, మాజీ కౌన్సిలర్ దిలీప్ ధోకా డిమాండ్ చేశారు. శుక్రవారం ఎక్సైజ్ అధికారులకు వినతి పత్రం అందజేశారుఉ. గత ప్రభుత్వం మద్యం నిషేధం అమలు చేస్తామని ప్రవాగ్దానం చేసి, అధికారంలోకి వచ్చాక మరిచిందన్నారు. కూటమి ప్రభుత్వం నాణ్యమైన మద్యం పేరుతో రోడ్లపై మద్యం విక్రయాలకు విమర్శించారు. బ్రాందీ షాపులే బార్లలా మారి, నివాసాల్లోనే ఏర్పాటు చేశారని, మందుబాబులు బహిరంగంగా మద్యం సేవిస్తూ స్థానికులకు ఇబ్బంది కలిగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నాయకులు మారుతీరావు, సాయినాథ్, తాయన్న పాల్గొన్నారు.

పదో తరగతి టాపర్‌కు సన్మానం



సలీమాను సన్మానిస్తున్న సాయిబాబా

ఆదోని అగ్రికల్చర్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షల్లో 597మార్కులు సాధించిన కిడ్డీస్ విద్యార్థిని దేవనకొండ సలీమాను దూదేకుల సంఘం నాయకులు శుక్రవారం సన్మానించారు. రాష్ట్ర గౌరవాధ్యక్షుడు సాయిబాబా మాట్లాడుతూ సలీమా ఉన్నత చదువుకు ప్రోత్సహిస్తామని అన్నారు. ఉద్యోగం సాధించి తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలని కోరారు. కార్యక్రమంలో రిటైర్డ్ తహసీల్దార్ షేక్షావలి, బదినేహాల్ మాబాషా పాల్గొన్నారు.

పంచాయతీ స్థలాలను ఆక్రమిస్తే చర్యలు



స్థలాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో వరలక్ష్మి

హాలహర్వి, ఏప్రిల్ 25 (ఆంధ్ర జ్యోతి): పంచాయతీ, గ్రామ కంఠం భూములను ఆక్రమిస్తే చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో వరలక్ష్మి హెచ్చరించారు. శుక్రవారం మెదహాళ్ గ్రామంలో సమస్యాత్మక స్థలాలను పరిశీలించారు. సమస్య ఉన్న స్థలాలపై పంచాయతీ అధికారులతో చర్చించి, గ్రామస్థుల సమక్షంలో పరిష్కారిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఈవోఆర్‌డీ రామాంజినేయులు పాల్గొన్నారు.

పందుల దొంగతనంపై నిఘా ఉంచాలి



డీఎస్పీకి జ్ఞాపికను అందజేస్తున్న నాయకులు

ఆదోని అగ్రికల్చర్, ఏప్రిల్ 25 (ఆంధ్ర జ్యోతి): పందులను కొందరు దొంగలిస్తున్నారని నిఘా ఉంచి కాపాడాలని నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ రాయలసీమ ఇన్‌చార్జి మోపురి సూర్య డీఎస్పీని కోరారు. శుక్రవారం డీఎస్పీ హేమలతకు విన్నవించారు. తాము పందుల పెంపకంపై ఆధారపడ్డామని, అయితే కొందరు దొంగలు పందులను ఎత్తుకుపోతున్నారని రూ.లక్షల్లో నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

పత్తికొండలో చోరీ

- రూ.42వేలు అపహరణ

పత్తికొండ, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తేరబజార్‌లో తాళం వేసిన ఓ ఇంటిలో చోరి జరిగింది. బాధితుడి కథనం మేరకు.. మెకానిక్ హనీఫ్ తన ఇంటి కింద పోర్షన్ అద్దెకు ఇచ్చి మేడపై నివసిస్తున్నారు. కుటుంబ సభ్యులు శుక్రవారం సాయంత్రం ఇంటికి తాళం వేసి ఆస్పరికి వెళ్లారు. హనీఫ్ రాత్రి 10గంటల ప్రాంతంలో ఇంటికి రాగా, తలుపులు తెరిచి ఉండి, బీరువా తెరచి ఉండడం, రూ.42వేలు ఎత్తుకెళ్లినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు పరిశీలించి, కేసు నమోదు చేసుకున్నారు

దాడులు అమానుషం

పత్తికొండ టౌన్, ఏప్రిల్ 25 (ఆంధ్ర జ్యోతి): జమ్మూ కశ్మీర్‌లో పర్యాటకులపై ఉగ్రవాదుల దాడులు దాడి అమానుషమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు రామచంద్రయ్య అన్నారు. పాకిస్తాన్ ఉగ్రవాదుల దాడిని ఖండిస్తూ శుక్రవారం పట్టణంలో నాలుగు స్థంభాల కూడలి వరకు కొవ్వొతులతో ర్యాలీ నిర్వహించారు. రాజాసాహేబ్, సురేంద్ర కుమార్, కారన్న, నెట్టికంటయ్య, కారుమంచి వీరన్న, గుండుబాసా, రంగన్న ఆల్తాఫ్ పాల్గొన్నారు. అలాగే సీపీఎం నాయకులు ప్రదర్శన చేశారు. వెంకటేశ్వరరెడ్డి, దస్తగిరి, మహబూబ్‌బాషా, రామాంజనేయులు ఉన్నారు.

ఉగ్రవాదుల దాడి అమానుషం

- ఆదోని, ఆలూరు, పత్తికొండలో నివాళులు



ఆదోనిలో కొవ్వొత్తులతో వీహెచ్‌పీ నాయకుల ప్రదర్శన

ఆదోని, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): కశ్మీర్‌లో పర్యాటకులపై ఉగ్రవాదులు దాడి అమానుషమని వీహెచ్‌పీ నాయకులు విట్టా రమేష్, ఉపేంద్ర, బసవన్న గౌడ్, నాగరాజు గౌడ్, మాజీ ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహి ంచారు. ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన వారికి నివాళులర్పించారు. ఉగ్రవాదుల దాడు లను ఖండిస్తున్నామని, దాడి అనంతరం భార త్‌లోని పాకిస్తాన్ రాయబార కార్యాలయంలో కేక్ కట్ చేసుకుని సంబరాలు చేసుకోవడం దారుణమని పేర్కొన్నారు.

ఉగ్రవాద దాడులు అమానుషం

తుగ్గలి: పర్యాటకులపై ఉగ్రవాదులు దాడులకు పాల్పడడం అమానుషమని, టీడీపీ నాయకులు, మాజీ ఎంపీటీసీ వల్లె వెంకటేశ్ బీజేపీ మండల అధ్యక్షుడు లక్ష్మన్న అన్నారు. శుక్రవారం తుగ్గలిలో కొవ్వొతులతో ర్యాలీ నిర్వహించారు. ఆకుల శీనప్ప, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రవాదుల దాడి హేయం: వీరభద్ర గౌడ్

ఆలూరు: కశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదుల కాల్పులు హేయమని టీడీపీ ఇన్‌చార్జి వీరభద్ర గౌడ్, మార్కెట్ యార్డ్ చైర్మెన్ మాజీ గుమ్మనూరు నారాయణ అన్నారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో మృతుల ఆత్మలకు శాంతి చేకూరాలని మౌనం పాటించారు. పాక్‌పై ప్రతికార చర్య తీసుకునేందుకు భారత్ సైన్యం ఎదురుదాడికి దిగిందన్నారు. మోదీ, అమిత్ షా ఈ కాల్పులపై సీరియస్‌గానే ఉన్నారన్నారు. ఽ మార్కెట్ యార్డ్ చైర్మెన్ మాజీ రామ్‌నాథ్ యాదవ్, ఏబీసీ కెనాల్ డీసీ చైర్మెన్ కిష్టప్ప, సర్పంచ్‌లు నాగరాజు, పురుషోత్తం పాల్గొన్నారు.

షాపింగ్‌కు వెళ్లడంతో బతికిపోయాం

- ఉగ్రదాడులను తప్పించుకున్న ఆదోని వాసి



కశ్మీర్‌లో ఆదోని వాసులు

ఆదోని టౌన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): కశ్మీర్ విహార యాత్రకు వెళ్లిన ఆదోని పట్టణానికి చెందిన ఇద్దరు మహిళలు ఉగ్రవాదుల దాడుల నుంచి తృటిలో తప్పించుకున్నారు. వివరాల మేరకు ఎస్‌కేడీ కాలనీ వాసులు సుజాత(విశ్రాంత బ్యాంక్ మేనేజర్), లలిత(విశ్రాంత ప్రొఫెసర్) బెంగుళూరు నుంచి కశ్మీర్‌కు వెళ్లారు. మొదటి రోజు అక్కడి ప్రకృతి అందాలను చూసి పరవశించారు. అయితే రెండో రోజు పహల్గామ్‌లో ఉగ్రదాడి జరగబోయే అరగంట ముందు షాపింగ్‌కు వెళ్లారు. ఆ సమయంలోనే ఉగ్రవాదులు విచక్షణా రహితంగా కాల్పులు జరిపారని సుజాత తెలిపారు. షాపింగ్‌కు వెళ్లకపోయి ఉంటే తాము కూడా బలికావాల్సి వచ్చేదని అన్నారు.

స్వర్ణరథంపై ప్రహ్లాదరాయలు


స్వర్ణరథంపై ఊరేగుతున్న ప్రహ్లాదరాయలు

మంత్రాలయం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): రాఘవేంద్ర స్వామి మఠంలో ఉత్సవ మూర్తి ప్రహ్లాదరాయలు స్వర్ణ రథంపై భక్తులకు దర్శనం ఇచ్చారు. శుక్రవారం చైత్రమాస ద్వాదశి వేడుకలను పురస్కరించుకుని పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల ఆధ్వర్యంలో తెల్లవారుజాము నుంచే రాఘవేంద్రస్వామి మూల బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛరణాలు, మంగళ వాయిద్యాల మధ్య స్వర్ణరథంపై వజ్రాలు పొదిగిన ప్రహ్లాదరాయలను అధిష్టించి పీఠాధిపతి మహామంగళహారతితో ఆలయ ప్రాంగణంచుట్టూ ఊరేగించారు. పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు భక్తులను ఆశీర్వదించారు.

అక్రమంగా మద్యం తరలిస్తే చర్యలు : ఎస్ఐ


మాధవరం చెక్‌పోస్టు వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్ఐ, పోలీసులు

మంత్రాలయం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక మద్యం తీసుకు వస్తే చర్యలు తీసుకుంటామని ఎస్ఐ విజయకుమార్ అన్నారు. శుక్రవారం రాత్రి మండలంలోని మాధవరం చెక్‌పోస్టు వద్ద ముమ్మరంగా వాహనాలు తనిఖీ చేశారు. కర్ణాటక నుంచి వచ్చే వాహనాలను తనిఖీ చేశారు. అదేవిధంగా డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ కర్ణాటక మద్యం రవాణాచేసినా, విక్రయించినా కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అక్రమ మద్యం తరలింపులో ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షిస్తామని హెచ్చరించారు. సిబ్బంది వీరాంజనేయులు, వీరేష్, చెక్‌పోస్టు సిబ్బంది ఉన్నారు.

కార్పొరేట్ సంస్థలపై చర్యలు తీసుకోవాలి


మాట్లాడుతున్న ఆర్‌వీఎఫ్ నాయకులు

ఎమ్మిగనూరు టౌన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ముందస్తు అడ్మిషన్లు చేపడుతున్న కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని ఆర్‌వీఎఫ్ జిల్లా కార్యదర్శి ఖాజా డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కొత్త విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే కార్పొరేట్ విద్యాసంస్థలు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ముందస్తు అడ్మిషన్లు తీసుకుంటూ విద్యార్థి తల్లిదండ్రులను నిలువుదోపిడి చేస్తున్నాయని ఆరోపించారు. టీచర్లకు అడ్మిషన్ల టార్గెట్ ఇస్తూ మానసికంగా ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. విద్యాశాఖాధికారులు స్పందించి చర్యలు తీసుకోకపోతే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. మోహన్, రవి, మల్లికార్జున, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

గోనెగండ్లలో గుర్రాల స్వైరవిహారం

● ఇబ్బందుల్లో గ్రామస్థులు


గోనెగండ్లలో బస్సుకు అడ్డంగా నిలిచిన గుర్రాల గుంపు

గోనెగండ్ల, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గాజులదిన్నె, హెచ్ కైరవాడి, వేముగోడు, కులుమాల, అలువాల గ్రామాల్లో నెల రోజులుగా గుర్రాలు స్వైరవిహారం చేస్తున్నాయి. ఆయా గ్రామాల్లోని వీధుల్లో అతి వేగంగా పరిగెత్తుతు ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. స్థానికులు రంగన్న, వలి అనే వ్యక్తులకు ఇటీవల గుర్రాలు తగలడంతో గాయాలయ్యాయి. రహదారులకు అడ్డంగా గుర్రాలు నిలిచి ఉండటం వల్ల ప్రజ ల రాకపోకలకు ఇబ్బందిగా మారిందని గ్రామస్థులు వాపోతున్నారు. అలాగే రాత్రిపూట గ్రామశివార్లలో ఉన్న పొలాలపై పడి ఉన్న అరకొర పంటను నాశనం చేస్తున్నారని రైతులు తెలుపుతున్నారు. గ్రామ పంచాయతీ సిబ్బంది గుర్రాలను పట్టుకొని యజమానులకు అప్పగించాలని ప్రజలు కోరుతున్నారు.

వేసవిలో తాగునీటి పథకాలకు సమస్య లేదు

● గాజులదిన్నె ప్రాజెక్టులో 1.2 టీఎంసీల నీరు
● రోజుకు 30 నుంచి 35 క్యూసెక్కుల నీరు ఆవిరి


గాజులదిన్నె ప్రాజెక్టులో నిలువ ఉన్న 1.2 టీఎంసీల నీరు

గోనెగండ్ల, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): వేసవిలో ఎండల మండిపోతున్నాయి. రెండు, మూడు రోజులుగా 42 డిగ్రీల ఎండ నమోదు అవుతుంది. అయితే గాజులదిన్నె ప్రాజెక్టు లో ప్రస్తుతం 1.2 టీఎంసీల నీరు మాత్రమే ఉంది. అయితే అధికారులు మాత్రం ఈ వేసవిలో ప్రాజెక్టు కింద ఉన్న తాగునీటి పథకాలకు నీటి సమస్య లేదని జీడీపీ ఇరిగేషన్ అధికారులు తెలుపుతున్నారు. ప్రస్తుతం జీడీపీలో నీటి మట్టం 2.0(గ్రాస్), (1.2లైవ్)టీఎంసీల నీరు ఉన్నట్లు తెలుస్తుంది. మండువేసవిలో ఈ స్థాయిలో నీటి నిలువ ఉండటవంతో జీడీపీ తాగునీటి పథకాలకు నీటి కొరత లేదని అధికారులు పేర్కొంటున్నారు. అయితే ఎండలు పెరిగే కొద్ది ప్రాజెక్టు నీరు ఆవిరి రూపంలో రోజుకు 30 నుంచి 35 క్యూసెక్కుల నీరు ఆవిరి అవుతున్నట్లు తెలుస్తుంది. మేలో ఎండతీవ్రత ఎక్కువగా ఉంటుంది. దీంతో జూన్, జూలై నెలలో వర్షాలు కురిసి ప్రాజెక్టుకు వరద నీరు వచ్చి చేరేవరకు తాగునీటి పథకాలకు ఇబ్బంది ఉంటుందా లేదా అన్నది స్పష్టంగా చెప్పడానికి వీలు కావడం లేదు అన్నది వాస్తవం. గాజులదిన్నె ప్రాజెక్టు కింద బండగట్టు, డోన్, క్రిష్ణగిరి నీటి పథకాల కింద దాదాపు 120 గ్రామాలకు తాగునీరు సరఫరా అవుతుంది. అయితే అవసర సమయంలో కర్నూలు, కోడుమూరు, గూడురు, బెళగల్, నగరాలకు తాగునీటి కోసం అధిక నీటిని తరలిస్తే కొంత ఇబ్బందిగా మారచ్చని తెలుస్తుంది.

కొనలేం.. తినలేం..

● చుక్కలు చూపుతున్న కూరగాయల ధరలు
● ఇక్కట్లు పడుతున్న వినియోగదారులు
● ఎండాకాలం ప్రభావం అంటున్న వ్యాపారులు


కూరగాయల అమ్ముతున్న వ్యాపారులు

కూరగాయల ధరలు కిలోల్లో

కూరగాయలు	రూపాయలు
పచ్చిమిర్చి	రూ. 80
టమోటా	రూ. 20
వంకాయలు	రూ. 80
బెండకాలు	రూ. 80
చెవలకాయలు	రూ. 80
అలుగడ్డలు	రూ. 80
క్యారెట్	రూ. 100
కాకరకాయలు	రూ. 80
తోటకూరకట్టలు రెండు	రూ. 10
పాలకూరకట్టలు రెండు	రూ. 10

గోనెగండ్ల, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం ప్రజలు కూరగాయలు కొనలేని.. తినలేని పరిస్థితులు నెలకొంటున్నాయి. వాటి ధరలు చుక్కలు చూపుతున్నాయి. సామాన్యులు కూరగాయలు తినాలంటే ఇబ్బందులు పడాల్సి వస్తుంది. వర్షాభావ పరస్థితి, ఎండాకాలం కావడతో కూరగాయల సాగుకు నీరందక దిగుబడి తగ్గిపోతుంది. దీంతో పదిహేను రోజులుగా కూరగాయలు, ఆకుకూరల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. పంటల దిగుబడి తగ్గడంతో ధరలు పెరిగిపోతున్నాయని వ్యాపారులు తెలుపుతున్నారు. కూరలు కొనడానికి రూ.100 తీసుకుపోతే మూడురకాలు కూరగాయాలు కూడా చేతికి రావడం లేదని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. గోనెగండ్ల, నందవరం, ఎమ్మిగనూరు మండలంలోని గ్రామాలు, గూడురు, బెళగల్ ప్రాంతాల రైతులు పండించిన పంటలు ఎమ్మిగనూరు మార్కెట్‌కు తరిలిస్తారు. అక్కడ వ్యాపారులు రైతుల దగ్గర నుంచి తక్కువ ధరలకు కొని మార్కెట్లో ఎక్కువ ధరలకు అమ్మకాలు చేస్తున్నారని రైతులు విమర్శిస్తున్నారు. దీంతో కూరగాయలు, ఆకుకూరలు పండించిన రైతుకు గిట్టుబాటధర లభించడం లేదు.

వైభవం.. రాఘవేంద్రుడి పల్లకోత్సవం


బంగారు కవచంతో స్వామివారికి అలంకరణ


శ్రీ మఠం ప్రాంగణంలో భక్తుల రద్దీ

మంత్రాలయం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : రాఘవేంద్ర స్వామి బంగారు పల్లకోత్సవం రమణీయంగా సాగింది. శుక్రవారం చైత్రమాస శుభదినాన్ని పురస్కరించుకొని పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు మూల బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాఘవేంద్రస్వామి బృందావన ప్రతిమను బంగారు పల్లకిలో అధిష్టించి ఊరేగించారు. అనంతరం ఊంజలసేవ చేశారు. బృందావనానికి బంగారు, వెండి, పట్టు వస్త్రాలు, గులాబి పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. పీఠాధిపతి భక్తులను ఆశీర్వదించారు.

పోటెత్తిన భక్తులు

రాఘవేంద్ర స్వామి దర్శనార్థం వచ్చిన భక్తులతో మంత్రాలయం సందడి గా మారింది. ద్వాదశి శుక్రవారం కావటంతో వేలాదిమంది భక్తులు తరలివచ్చారు. దీంతో మఠం ప్రాంగణం భక్తులతో కిక్కిరిసింది. గురువారం నుంచి శుక్రవారం రాత్రి వరకు భక్తుల సంఖ్య పెరుగుతూ వచ్చింది.శని,ఆది వారాల్లో మరింత భక్తులు రానున్న నేపథ్యంలో శ్రీమఠం అధికారులు ప్రత్యేక ఏర్పాట్లకు శ్రీకారం చుట్టారు. అన్నపూర్ణ భోజనశాల, మహాముఖద్వారం, మధ్వమార్గ్ కారిడార్, ప్రధాన రహదారులు, రాఘవేంద్ర సర్కిల్, తుంగభద్ర నది తీరం భక్తులతో కోలాహలంగా మారింది. తుంగభద్ర నదిలో పుణ్య స్నానాలు ఆచరించి గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకొని రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.

బంద్ పాక్షికం

● వీహెచ్‌పీ, ప్రజాసంఘాలు ర్యాలీ


ఎమ్మిగనూరులో ర్యాలీ చేస్తున్న ఆయా సంఘాలు, పార్టీల నాయకులు, కార్యకర్తలు

ఎమ్మిగనూరు,ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): కశ్మీర్‌లో ఉగ్రదాడిని నిరసిస్తూ వీహెచ్‌పీ, ప్రజాసంఘాలు ఇచ్చిన బంద్ శుక్రవారం ఎమ్మిగనూరులో పాక్షికంగా జరిగింది. ఉగ్రదాడిని నిరసిస్తూ వీహచ్‌పీ, బీజేపీ, ప్రజాసంఘాల నాయకులు స్వచ్ఛంద బంద్‌కు పిలుపునిచ్చారు. దీంతో పట్టణంలోని ప్రధాన రహదారులల్లో దుకాణాలు, హోటళ్ల నిర్వాహకులు మధ్యాహ్నం వరకు బంద్ చేసి సంఘీభావం ప్రకటించారు. ప్రభుత్వ కార్యాలయాలు, బ్యాంకులు, ఆర్టీసీ యథావిధిగా పనిచేశాయి. ఉగ్రదాడిని నిరసిస్తూ ఆయా సంఘాలు, పార్టీల ఆధ్వర్యంలో సాయంత్రం పట్టణంలోని ఎంజీ పెట్రోల్ బంకునుంచి సోమప్ప సర్కిల్ వరకు మహిళలు, నాయకులు, కార్యకర్తలు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆయా రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాల నాయకులు తొగట నరసింహులు, సత్యనార్యాణ రెడ్డి, దివాకర్‌రెడ్డి, నాగేశప్ప, దయాసాగర్, శివ, అర్చకులు శ్రీనివాసులు, వడ్డే ఉరుకుందు, మధుబాబు, ఆపాస్ రంస్వామి, జగ్గాపురం చిన్న ఈరన్న, తిమ్మప్ప పాల్గొన్నారు.

ఉగ్రదాడికి నిరసనగా మౌన ప్రదర్శన

ఎమ్మిగనూరు టౌన్: కశ్మీర్‌లో జరిగిన ఉగ్రవాద దాడులను ఖండిస్తూ ముస్లింలు మౌన ప్రదర్శన చేపట్టారు. పట్టణంలోని హాఫిజ్ మసీద్ కమిటీసభ్యులు శ్రీరామ మెడికల్ షాపు వరకు మౌన ప్రదర్శన చేస్తూ ర్యాలీగా వెళ్లారు. అనంతరం యూసుఫ్ మౌలానా మాట్లాడుతూ కశ్మీర్‌లో జరిగిన ఉగ్ర ముష్కరుల దాడిలో ప్రాణాలు కోల్పోయిన వారి కోసం నిమిషం పాటు మౌనవ్రతం పాటించారు. దాడులకు పాల్పడిన ఉగ్రవాదులను వెంటనే శిక్షించాలని డిమాండ్ చేశారు. భారత్‌దేశంలో హిందు, ముస్లింలు భాయ్‌భాయ్ అని అన్నారు. ఇమ్రాన్ మౌలానా, చాంద్, ఫారుక్, మెకానిక్ బాషా, అల్తాఫ్ పాల్గొన్నారు.


కోసిగిలో కొవ్వొత్తులతో ర్యాలీ

కొవ్వొత్తుల ర్యాలీ

నందవరం: కశ్మీర్‌లో ఉగ్రవాదుల దాడిని ఖండిస్తూ శుక్రవారం విశ్వహిందూ పరిషత్, హిందూ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో నందవరంలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. మృతులకు నివాళి అర్పించారు. దాడులు హేయమైన చర్య అన్నారు.

అమాయకులను హత్య చేయడం బాధాకరం

మంత్రాలయం: కశ్మీర్‌లో అమాయకులను బలి తీసుకోవడం బాధాకరమని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి, ఐక్య వాల్మీకి పోరాట కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు బి.లక్ష్మన్న అన్నారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆదేశాల మేరకు మంత్రాలయంలో మూడు రోజుల పాటు ఉగ్రవాదుల దాడులను ఖండిస్తూ నిరసనలు చేపట్టారు. శుక్రవారం మంత్రాలయంలో జనసేన నాయకులు, కార్యకర్తలతో కలిసి దీక్షలు చేపట్టారు. ఉగ్రవాదుల చర్యలను ఖండించేందుకు దేశమంతా ఏకతాటిపై రావాలని పిలుపునిచ్చారు. ఉగ్రవాదులపై గళం విప్పాల్సిన ఆసన్నమైందన్నారు. దేశంలో ఐకమత్యంగా హిందూ, ముస్లింల మధ్య గొడవలు సృష్టించేందుకు ఇలాంటి దారుణాలు చేస్తున్నారని, ఇలాంటి కిరాతకమైన చర్యను ఖండిస్తున్నట్లు తెలిపారు. కోసిగి, మంత్రాలయం, పెద్దకడుబూరు నాయకులు చింతలగేని వీరారెడ్డి, నరసింహులు, బీవీ రవిచంద్ర, రఘు, భీమయ్య, గాలి రఘు, ఆలీబాషా పాల్గొన్నారు.

ఉగ్రవాదులను అంతమొందించాలి

కోసిగి: దేశంలో ఉగ్రవాదులను అంతమొందించాలని అఖిలపక్ష, విశ్వహిందూ పరిషత్ నాయకులు డిమాండ్ చేశారు. ఉగ్రదాడుల్లో మరణించిన యాత్రికులకు శుక్రవారం కోసిగి మండలం విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించి నివాళులర్పించారు. టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు ముత్తురెడ్డి, రైతుసంఘం జిల్లా నాయకుడు నాడిగేని అయ్యన్న, వైసీపీ నాయకులు ఎంపీపీ లవకుశ ఈరన్న, నాడిగేని నాగరాజు, ముకుంద కృష్ణమూర్తి, బుకింటి వీరేష్, విశ్వహిందూ పరిషత్, భజరంగదళ్, ఏబీవీపీ నాయకులు పాల్గొన్నారు.

జనరల్ ఫండ్ నుంచి పట్టణాభివృద్ధికి నిధులు


● టీడీపీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ దయాసాగర్
● వార్డుల్లో రోడ్లు, డ్రైనేజీలు నిర్మించండి : వైసీపీ కౌన్సిలర్లు
● పహల్గాం మృతులకు కౌన్సిల్ నివాళి


మౌనం పాటిస్తున్న మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు

ఎమ్మిగనూరు, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): పురపాలక సంఘం జనరల్ ఫండ్ నుంచి ఇక పట్టణాభివృద్ధికి నేరుగా నిధులు విడుదల చేసుకునే విధంగా ప్రభుత్వం జీఓ విడుదల చేయడం మంచి పరిణామమని, దీంతో పట్టణాన్ని మరింత అభివృద్ధి చేసుకోవచ్చని టీడీపీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ వీజేపీ దయాసాగర్ అన్నారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ డాక్టర్ రఘు అధ్యక్షతన మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశాన్ని నిర్వహించారు. ముందుగా ఇటీవల కశ్మీర్‌లో జరిగిన ఉగ్రదాడిని ఖండిస్తూ మృతులకు కౌన్సిల్ సభ్యులు రెండునిమిషాలు మౌనం పాటించి నివాళి అర్పించారు. అనంతరం ఫ్లోర్ లీడర్ దయాసాగర్ మాట్లాడుతూ గతంలో జనరల్ ఫండ్ నేరుగా వాడుకునే అవకాశం ఉండేది కాదన్నారు. అయితే ప్రస్తుత ప్రభుత్వం మున్సిపాలిటీలే జనరల్ ఫండ్ నిధులను పట్టణాభివృద్ధికి వాడుకునే విధంగా జీవో విడుల చేసిందన్నారు. ఎమ్మిగనూరుకు ప్రతిఏడాది రూ.12కోట్ల ఆదాయం వస్తుందని ఆ నిధులను వినియోగించి పట్టణాన్ని మరింత అభివృద్ధి చేసుకునే అవకాశం వచ్చిందన్నారు. అలాగే 15వ ఆర్థిక సంఘం నిధులు రూ. 12 కోట్లు ఉన్నాయని వీటిని కూడా ఏడాదిలోపు వినియోగించుకోవచ్చాన్నారు. ఇక పట్టణానికి ఈ వేసవిలో తాగునీటి సమస్య లేకుండా ఎమ్మెల్యే జయనాగేశ్వర రెడ్డి ఆదేశాలతో మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకున్నారన్నారు. అనంతరం వైసీపీ కౌన్సిలర్లు అంపమ్మ, కేశవరెడ్డి, శివప్రసాద్‌లు మాట్లాడుతూ తమ వార్డుల్లో సీసీ రోడ్లు వేయాలని కోరుతున్న పట్టించుకోవటం లేదని ఆరోపించారు. ప్రధానంగా గాంధీనగ్‌లోని వైష్ణవి కాలేజి వెనుక తాగునీరు సరిగా రావటం లేదని, దీంతో కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారన్నారని అధికారుల దృష్టికి తీసుకవచ్చారు. కుర్ని శ్మశాన వాటికకు రోడ్డు ఏర్పాటు చేయాలని, ప్రహరీ నిర్మించాలని శివప్రసాద్ కోరారు. కమిషనర్ గంగిరెడ్డి స్పందిస్తూ ఆస్తిపన్ను వసూళ్లలో జిల్లాలో ప్రథమస్థానంలో ఉన్నామన్నారు. ఇక వార్డుల్లో సీసీ రోడ్లు, తాగునీటి సమస్యలేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. అజెండాలో ప్రవేశపెట్టిన 36 అంశాలను సభ్యులు ఆమోదించారు. సమావేశంలో కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

పశుగ్రాసం ధరకు రెక్కలు

● నదితీర గ్రామాల గ్రాసానికి భారీ డిమాండ్
● తరలించే క్రమంలో వాహనదారుల అగచాట్లు


అధిక లోడ్‌తో వెళ్తున్న పశుగ్రాసం ట్రాక్టర్

కోసిగి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): వేసవిలో పశుగ్రాసం ధరకు రెక్కలొచ్చాయి. ట్రాక్టర్ పశుగ్రాసం ధర రూ.16వేలు పలుకుతోంది. వేసవికాలం కావడంతో పశువుల మేత కోసం రైతులు పశుగ్రాసం కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అందులో భాగంగా కోసిగి మండల పరిధిలోని తుంగభద్ర నదీతీర గ్రామాల్లో వరి రైతులు పండించిన పశుగ్రాసానికి భారీగా డిమాండ్ ఉంది. గత వారం రోజులుగా తుంగభద్ర నదీతీర గ్రామాల నుంచి వివిధ ప్రాంతాల రైతులు ట్రాక్టర్ల ద్వారా పశుగ్రాసాన్ని కొనుగోలు చేసి తమ సొంతూళ్లకు తరలిస్తున్నారు. అయితే, ట్రాక్టర్లపై గ్రాసాని తీసుకెళ్తున్న సమయంలో ఇటు రైతులకు తిప్పలు తప్పడం లేదు. అటు ప్రయాణికులకు అగచాట్లు తప్పడం లేదు. ముఖ్యంగా ట్రాక్టరు డ్రైవర్లు పశుగ్రాసాన్ని ప్రమాదకర స్థితిలో అత్యంత ఎత్తుతో పాటు వెడల్పు రవాణా చేస్తుండటంతో విద్యుత్ తీగలకు తగిలే ప్రమాదం పొంచి ఉన్నది. అలాగే గ్రాసం వెనుకాల వచ్చే వాహనాలకు ముందు వెళ్లే వాహనాలు కనపడకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. స్థానిక పోలీసులు ట్రాక్టరు డ్రైవర్లకు, రైతులకు అవగాహన కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

సమస్యలు పరిష్కరిస్తాం

టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి


రాఘవేంద్రరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న విద్యార్థి సంఘం నాయకులు

మంత్రాలయం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తమదృష్టికి తెస్తే పరిష్కరిస్తామని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి అన్నారు. శుక్రవారం మాధవరం తన నివాసంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. అర్జీలను స్వీకరిస్తూ అధికారులతో ఫోన్‌లో మాట్లాడుతూ కొన్ని సమస్యలు అక్కడికక్కడే పరిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యకర్తలు అధైర్యపడొద్దని, పార్టీతో పాటు రామిరెడ్డి కుటుంబం ఎప్పుడూ అండగా ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గోపాల్, రామకృష్ణ, శివ, లక్ష్మన్న, రామయ్య, పొలివీరేష్, బొజ్జప్ప, కేశన్న, రామకృష్ణ పెద్దఎత్తున కార్యకర్తలు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు టీడీపీ అండ

మంత్రాలయం మండలంలోని మాధవరం గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకులు విడపనూరు ముక్కన్న (52) గుండెపోటుతో శుక్రవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్ర రెడ్డి మృతదేహానికి నివాళులు అర్పించారు. కుటుంబాన్ని ఓదార్చి ధైర్యంగా ఉండాలని సూచించారు. ఈసందర్భంగా రాఘవేంద్ర రెడ్డి మాట్లాడుతూ ముక్కన్న లేనిలోటు పార్టీకి తీరని లోటని అన్నారు. టీడీపీ నాయకులకు, కార్యకర్తలకు ఎటువంటి ఆపద, కష్టం వచ్చినా మాధవరం రామిరెడ్డి కుటుంబం అండగా ఉండి అన్ని విధాలుగా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పల్లిపాడు రామిరెడ్డి, కేశన్న, భీమిరెడ్డి, నాగరాజు, హుస్సేని తదితరులు పాల్గొన్నారు.

డబుల్ రోడ్డు వేయాలి

పెద్దకడుబూరు:మండలంలోని కంబళదిన్నె నుంచి ఎమ్మిగనూరు వరకు డబుల్ రోడ్డు మంజూరు చేయాలని ఆర్‌పీవీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఖాజా, కృష్ణ డిమాండ్ చేశారు. శుక్రవారం టీడీపీ మంత్రాలయం ఇన్‌చార్జి నాయకుడు రాఘవేంద్రరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కంబళదిన్నె నుంచి ఎమ్మిగనూరుకు సింగిల్ రోడ్డు ఉండడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఎదురెదురుగా పెద్ద వాహనాలు వస్తే సైడ్ ఇవ్వడానికి కూడా వీలులేకుండా పోతుందన్నారు. ద్విచక్రవాహనదారులు నరకయాతన అనుభవించాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. కార్యక్రమంలో మోహన్, శేషు, వీరేష్, రవీంద్ర పాల్గొన్నారు.

అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తే కేసులు


మాట్లాడుతున్న తహసీల్దార్ రజినీకాంత్

కౌతాళం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తే కేసులు నమోదు చేస్తామని తహసీల్దార్ రజినీకాంత్ రెడ్డి హెచ్చరించారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఉచిత ఇసుక విధానంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న కొందరు నిబంధనలు అతిక్రమిస్తున్నారని అన్నారు. ఆయా గ్రామాల వీఆర్ఏలు రీచ్‌లలోకి వచ్చే వాహనాలకు పర్మిట్‌లను పరిశీలించిన తరువాతనే లోపలికి పంపించాలని తెలిపారు. ఏమైనా అనుమానాలు వస్తే సంబంధిత వీఆర్వోలకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. ప్రతి రోజు ఇసుక రీచ్‌లలో సీసీ కెమెరాలు పని చేసేలా యజమానులు చర్యలు తీసుకోవాలన్నారు. ఇసుక లారీలలో ప్రభుత్వం తెలిపిన నిబంధనల మేరకు ఇసుకను తరలించాలని అధిక లోడ్‌లతో ఇసుకను తరలించవద్దని తెలిపారు. సంబంధిత గ్రామాలలో ఇసుక కావాల్సిన వారు కూడా తప్పక మీసేవాలో పేరు నమోదు చేసిన తరువాతనే ఇసుకను తరలించుకోవచ్చని తెలిపారు. ఆర్ఐ లక్ష్మన్న కౌతాళం సీఐ అశోక్ కుమార్, వీఆర్వోలు నాగార్జున, రామాంజనేయులు ఉన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

● రక్తపరీక్ష చేయించుకోండి : డాక్టర్ రజిత


కోసిగిలో ప్రతిజ్ఞ చేస్తున్న వైద్యసిబ్బంది

కోసిగి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): వ్యాధులు దరి చేరకుండా ఉండేందుకు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని డాక్టర్ రజిత అన్నారు. శుక్రవారం కోసిగిలో ప్రభుత్వ వైద్యసిబ్బందితో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రజిత మాట్లాడుతూ దోమలు కుట్టకుండా దోమతెరలు వాడాలని, రోజు విడిచి రోజు జ్వరం వస్తే రక్తపరీక్షలు చేయించుకోవాలని సూచించారు. సామాజిక ఆరోగ్య అధికారి ఈశ్వరమ్మ, శ్రీనివాసులు, సూపర్‌వైజర్లు జయమ్మ, రాముడు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి



గోనెగండ్లలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యఆరోగ్య సిబ్బంది

గోనెగండ్ల: మలేరియా వ్యాధి సోకకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు రంగారవళి, ఆదోని మలేరియా అధికారి సాయిబాబా సూచించారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా శుక్రవారం గోనెగండ్లలో వైద్యఆరోగ్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. మలేరియా జ్వరం దోమకాటు వల్ల వస్తుందని, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని వారు కోరారు. మలేరియా సోకకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు.

అప్రమత్తతే శ్రీరామరక్ష

ఎమ్మిగనూరు: అగ్నిప్రమాదాలపై అప్రమత్తతే శ్రీరామ రక్ష అని ఎమ్మిగనూరు ఫైర్ ఆఫీసర్ రామాంజనేయులు అన్నారు. శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ కమ్యూనిటీవైద్యశాలలో వైద్యసిబ్బందికి అగ్నిప్రమాదాలు, నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అప్రమత్తతోనే అగ్నిప్రమాదాలు నివారించొచ్చన్నారు. ప్రమాదసంఘటనలు చోటుచేసుకున్న వెంటనే అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సుధా, వైద్యులు మహెబూబ్, వెంకటేశ్వర్లు, ప్రియాంక, సిబ్బంది పాల్గొన్నారు.